

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మెదక్
ఆదివారం | 03 నవంబర్ 2024 | www.navatelangana.com

కదం తొక్కిన.. ఎర్రదండు







- భారీ ప్రదర్శన... బహిరంగ సభ
- పార్టీ జెండా ఎగరేసిన సీనియర్ నాయకులు సర్దార్
- ఉత్తేజ భరితంగా తూప్రాన్‌లో సీపీఐఎం జిల్లా 15వ మహాసభలు ప్రారంభం
- ప్రజల పక్షాన పోరాడేది ఎర్రజెండానే: చుక్క రాములు

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

శ్రమటోడ్చే శ్రామిక జనం పిడికిలెత్తి ఎర్రజెండాలు చేతబట్టి కదం తొక్కారు. మండుటెండల్లో డప్పుల దర్వులు... ఆటా పాటలలో అడుగేస్తూ దండుగా కదిలారు. ఒక్కరా ఇద్దరా వేలాది మంది కష్టజీవులు, కార్మికులు, కర్షకులు, మహిళలు, యువకులు, కూలీలు, రైతులు భారీ ప్రదర్శనగా సాగారు. ఎర్రజెండాల రెపరెపలతో తూప్రాన్ పట్టణమంతా ఎరుపెక్కింది. మెదక్ జిల్లా వ్యాప్తంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు సభలో పాల్గొన్నారు. పార్టీ మహాసభలకు శని, ఆదివారాల్లో జరగనున్నందున ఆహ్వాన సంఘం భారీ ఏర్పాట్లు చేసింది. ముస్తాబైన లింగారెడ్డి గార్డెన్‌లో ప్రారంభ సభ, ప్రతినిధుల మహాసభల విజయవంతంగా నిర్వహించారు.

ఉత్సహాపూరితంగా మహాసభలు ప్రారంభం

సీపీఐ(ఎం) మెదక్ జిల్లా 15వ మహాసభలు స్థానిక లింగారెడ్డి గార్డెన్‌లో శనివారం అత్యంత ఉత్సహాపూరిత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా మొదటి రోజు నిర్వహించిన భారీ ప్రదర్శనలో సీపీఐ(ఎం) శ్రేణులు ఎద్ద ఎత్తున పాల్గొన్నారు. పట్టణ వీధుల్లో ఎర్ర సైన్యం కవాతు తొక్కడంతో మంచి ప్రభావం పడింది. రెండు రోజుల పాటు జరిగే మహాసభలకు ఎంపికైన ప్రతినిధులు, పరిశీలకులు, ప్రత్యేక ఆహ్వానితులు హాజరయ్యారు. పార్టీ మహాసభల ప్రారంభ సూచికగా పార్టీ జెండాను సీనియర్ నాయకులు, జిల్లా కమిటీ సభ్యులు సర్దార్ ఎగురవేశారు. పార్టీ నాయకులు, ప్రతినిధులు అమరవీరుల స్థూపం వద్ద ఘనంగా నివాళ్లు అర్పించారు. సభా వేదికపై పార్టీ జాతీయ కార్యదర్శిగా పనిచేసి ఇటీవల మరణించిన సీతారాం ఏచూరి చిత్రపటానికి చుక్క రాములు పూల మాల వేసి జోహార్లు అర్పించారు. అనంతరం ప్రారంభ సభ పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.మల్లేశం అధ్యక్షతన నిర్వహించారు. ఈ సభలను ప్రారంభిస్తూ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చుక్క రాములు మాట్లాడారు. జాతీయ, అంతర్జాతీయ రాజకీయ, ఆర్థిక పరిస్థితుల్ని వివరించారు. రాష్ట్రంలో నెలకొన్న రాజకీయ పరిస్థితులతో పాటు ప్రజలెదుర్కొంటున్న సమస్యలపై నిర్వహించాల్సిన పోరాట కర్తవ్యాలను ఆయన గుర్తు చేశారు. ఎ. మల్లేశం మాట్లాడుతూ మెదక్ జిల్లాలో సీపీఐ(ఎం) నిర్వహించిన పోరాటాలు, ఉద్యమాలకు సంబంధించిన విషయాల్ని వివరించారు. ముఖ్యంగా అటవీ భూముల హక్కుల కోసం నిర్వహించిన పోరాటాలు, బీడీ కార్మికులు, పరిశ్రమల్లో పనిచేసే కార్మికులు, హమాలీలు, అంగన్వాడీలు, ఆశాలు, మధ్యాహ్న భోజన, గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీ వంటి కార్మికుల హక్కులు, జీతభత్యాల కోసం చేసిన పోరాటాలు, సాధించిన విషయాలను పేర్కొన్నారు. అదే విధంగా రాష్ట్ర పార్టీ నుంచి పరిశీలకులుగా హాజరైన పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు జయలక్ష్మి, ఎం. అడివయ్య, జే.మల్లిఖార్జున్‌తో పాటు సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి, సంగారెడ్డి జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు మాట్లాడారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు బొప్పని పద్మ, ఆహ్వాన సంఘం చైర్మన్ సర్దార్ ప్రతినిధులకు ఆహ్వానం పలుకుతూ మాట్లాడారు. సభకు మహిళలు పెద్ద ఎత్తున తరలి వచ్చారు.

కదంతొక్కిన ఎర్రదండు

మెదక్ జిల్లా మహాసభల సందర్భంగా తూప్రాన్ పట్టణంలో నిర్వహించిన భారీ ప్రదనలో వేలాది మంది సీపీఐఎం శ్రేణులు కదం తొక్కారు. ఎర్రజెండాల రెపరెపల మధ్య డప్పుల దర్వేస్తూ ఆడుతూ పాడుతూ ప్రదర్శనగా సాగారు. స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి లింగారెడ్డి గార్డెన్ వరకు రెండు కిలో మీటర్ల వరకు మండుటెండల్లో ఎర్రదండు కవాతు తొక్కింది. ప్రదర్శనకు ముందు భాగాన చుక్కరాములు, జయలక్ష్మి, ఎ.మల్లేశం, మల్లారెడ్డి, గొల్లపల్లి జయరాజు, ఎం.అడివయ్య, జె.మల్లిఖార్జున్, పద్మ వంటి రాష్ట్ర నాయకులు నడిచారు. సంఘటిత, అసంఘటిత రంగంలోని కార్మికులు, రైతుకూలీలు, గ్రామీణ పేదలు, వివిద రంగాల్లో పనిచేసే కష్టజీవులు ఎర్రజెండాల్ని చేతబూని జోరుగా ప్రదర్శనలో పాల్గొన్నారు. తూప్రాన్ గడ్డపై సీపీఐఎం ఎర్రజెండా రెపరెపలతో సాగిన భారీ ప్రదర్శనను పట్టణ ప్రజలను ఆకట్టుకుంది. ఈ మహాసభల్లో మెదక్ జిల్లా పార్టీ కార్యదర్శి వర్గ సభ్యులు నర్సమ్మ, కె.మల్లేశం, మహేందర్‌రెడ్డి, బసవరాజుతో పాటు పార్టీ జిల్లా కమిటీ సభ్యులు కడారి నాగరాజు, బాలమణి, బాగయ్య, ఇతర ప్రజా సంఘాల నాయకులు సంతోష్, సత్యం, ప్రశాంత్ పాల్గొన్నారు.

ప్రతినిధుల మహాసభలు

ప్రారంభ సభ ముగిసన తర్వాత పార్టీ ప్రతినిధుల మహాసభ ప్రారంభమైంది. జిల్లా వ్యాప్తంగా ఆయా ప్రాంతాల నుంచి ఎంపికైన ప్రతినిధులు మహాసభల్లో పాల్గొన్నారు. మహాసభలకు పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నర్సమ్మ కె.మల్లేశం, మహేందర్‌రెడ్డి అధ్యక్షవర్గంగా వ్యహరించారు. పార్టీ కార్యదర్శి వర్గ సభ్యులు స్టీరింగ్ కమిటీ కొనసాగింది. గత మహాసభల నుంచి ఈ మహాసభ వరకు పార్టీ నిర్వహించిన పోరాటాలు, ఆందోళనలు, ఉద్యమాలు, పార్టీ నిర్మాణానికి సంబంధించిన నివేదికను పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.మల్లేశం ప్రవేశపెట్టారు. కార్యదర్శి నివేదకపై మండలాలు, ఆయా రంగాల వారిగా గ్రూపు చర్చల్లో చర్చించారు. అదే విధంగా ప్రజా సమస్యలకు సంబంధించిన పలు అంశాలపై తీర్మానాలు ప్రవేశ పెట్టారు. ఆదివారం కూడా ప్రతినిధుల మహాసభ కొనసాగనుంది. పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చుక్క రాములు మహాసభకు దిశ నిర్దేశం చూస్తూ మాట్లాడనున్నారు. రైతులు, కార్మికులు, మహిళలు, స్కీమ్ వర్కర్లు, నిర్వాసితులు, దళితులు, గిరిజనులు, నిరుద్యోగులు, విద్యార్థులకు సంబంధించిన పలు అంశాలపై తీర్మానాలు ఆమోదించనున్నారు. మహాసభలకు హాజరైన ప్రతినిధులు రాబోయే మూడేళ్ల కాలంలో పార్టీ నిర్వహించాన పోరాట కర్తవ్యాలను రూపొందించనున్నారు. అదే విధంగా నూతన జిల్లా కార్యదర్శి, కార్యవర్గం ఎన్నిక కానుంది.

హరీశ్‌రావుకు దీపావళి శుభాకాంక్షలు తెలిపిన షేక్ ఫారీద్



నవతెలంగాణ-జహీరాబాద్

మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావుకి ఆయన నివాసంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు షేక్ ఫారీద్ శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్ప గుచ్చం అందజేసి దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. వారితోపాటు మాజీ కౌన్సిలర్లు అబ్దుల్లా,అలిమ్, సాధిక్, అవేజ్ తదితరులున్నారు.

జహీరాబాద్ ఆర్‌డీఓగా రామ్‌రెడ్డి



నవతెలంగాణ-జహీరాబాద్

జహీరాబాద్ ఆర్డీవోగా రామ్‌రెడ్డి శనివారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. కల్వకుర్తి డిప్యూటీ కలెక్టర్‌గా విధులు నిర్వహించిన ఆయన.. జహీరాబాద్‌కు బదిలీపై వచ్చారు. రామ్‌రెడ్డి గతంలో సదాశివపేట, తహసీల్దార్‌గా, డిప్యూటీ తాసిల్దార్‌గా కూడా విధులు నిర్వహించారు. ఈ సందర్భంగా రామ్‌రెడ్డి మాట్లాడుతూ.. రెవెన్యూకు సంబంధించిన సమస్యలు ఏమైనా ఉంటే నేరుగా తహసీల్దారులను లేదా ఆర్డీవో కార్యాలయాన్ని సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ఎప్పటికప్పుడు ప్రజల వద్దకు చేర్చేందుకు కృషి చేస్తామన్నారు. జహీరాబాద్‌లో ప్రధానంగా నిమ్జ్, గ్రీన్ ఫార్మాసిటీ కి సంబంధించిన ప్రాజెక్టులు కొనసాగుతున్నాయని.. వాటన్నింటిని పూర్తి చేసేందుకు సాయ శక్తుల కృషి చేస్తామన్నారు.

బెడ్‌పై నుంచి కింద పడి విద్యార్థి మృతి



నవతెలంగాణ-జహీరాబాద్

సెవెంత్ డే పాఠశాలలో ఓ ఐదో తరగతి విద్యార్థి ప్రమాదవశాత్తు బెడ్ పై నుంచి కిందపడి మృతి చెందాడు. ఎస్సై కాశీనాథ్ తెలిపిన వివరాల ప్రకారం.. సాత్విక్(12) అనే విద్యార్థి స్థానికంగా గల సెవెంత్ డే స్కూల్‌లో ఐదో తరగతి చదువుతూ పాఠశాలకు చెందిన హాస్టల్‌లోనే ఉం టున్నాడు. అయితే శనివారం రోజున అతడు డబుల్ కాట్ బెడ్ నుంచి కిందకు దిగుతుండగా ప్రమాదవశాత్తు బోర్లా పడ్డాడు. ఆ బెడ్ కూడా అతనిపై పడడంతో తల వెనుక భాగంలో బలమైన గాయ మైంది. వెంటనే స్కూలు యజమాన్యం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా డ్యూటీ డాక్టర్ పరిశీలించి చనిపోయినడని నిర్ధారించారు. మృతుడి తండ్రి శ్రీకాంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

చెట్లు నరికిన వారిపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-మునిపల్లి



మండలంలోని చీలపల్లి గ్రామం లో కొందరు గ్రామస్తులు, అధికారులు కుమ్మక్కై అక్రమంగా టేకు చెట్లు నరికి అమ్ముకున్నారని ఆరోపిస్తూ గ్రామానికి చెందిన నాగేష్ మండల పరిషత్ అభివృద్ధి అధికారి హరినందన్‌రావుకు శనివారం ఫిర్యాదు చేశారు. పాఠశాల ఆవరణలోని చెట్లను కాపాడాలని, పాఠశాల సంబంధించిన ఆస్తులను పరిరక్షించాలని ఆయన ఫిర్యాదులో ప్రస్తావించారు. చెట్టు నరికిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు.

అగ్ని ప్రమాదానికి ఇల్లు దగ్ధం

నవతెలంగాణ-ఐడీఏబొల్లారం



దీపావళి పండుగ వేళ బొల్లారం మున్సిపాల్టీ పరిధిలోని మల్లన్న బస్తీలో నివసించే మున్నాయాదవ్ ఇల్లు ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదానికి గురైంది. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న మున్సిపల్ కౌన్సిలర్ చంద్రారెడ్డి బాధిత కుటుం బాన్ని శనివారం పరామర్శించారు. బాధిత కుటుంబానికి అండగా తనవంతు సంపూర్ణ సహకారాన్ని అందిస్తానని హామీ ఇచ్చారు. ప్రభుత్వం మున్నా యాదవ్ కుటుంబాన్ని ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ రాజు, స్థానికులు శేఖర్, వర్మ, పద్మ ధనుంజయ్, మెట్టు యాదవ్, బీనయి, కమలేష్, అజయ్ మరియు బస్తీ వాసులు పాల్గొన్నారు.

పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను తక్షణమే ప్రారంభించాలి

- రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి
- వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ధాన్యం సేకరణపై కలెక్టర్లతో సమీక్ష

నవతెలంగాణ-సంగారెడ్డి/సిద్దిపేట కలెక్టరేట్







జిల్లాలో నిర్దేశించుకున్న ప్రణాళిక ప్రకారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను పూర్తిస్థాయిలో తక్షణమే ప్రారంభించాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని సచివాలయం నుంచి శనివారం ధాన్యం కొనుగోళ్లపై రాష్ట్ర ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించగా, ధాన్యం సేకరణకు సంబంధించి తీసుకోవాల్సిన చర్యల గురించి పౌర సరఫరాల శాఖ ప్రధాన కార్యదర్శి డి.ఎస్.చౌహాన్ సూచనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోలు ప్రక్రియ ప్రభుత్వానికి అత్యంత ప్రతిష్టాత్మకమని, ఏ చిన్న ఇబ్బంది లేకుండా సమర్థవంతంగా ధాన్యం సేకరణ జరిగేలా జిల్లా కలెక్టర్లు ప్రత్యేకంగా పర్యవేక్షించాలన్నారు. ప్రభుత్వం కొన్ని వేల కోట్లు ఖర్చు చేసి ధాన్యం కొనుగోలు ప్రక్రియ చేపట్టిందని గుర్తు చేశారు. సన్నరకం ధాన్యం సాగు ప్రోత్సహించేందుకు ప్రభుత్వం క్వింటాల్‌కు రూ.500 బోనస్ ప్రకటించినట్టు గుర్తు చేశారు. జిల్లాలో రూపొందించుకున్న ప్రణాళికల ప్రకారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను పూర్తిస్థాయిలో ప్రారంభిం చాలని, కొనుగోలు కేంద్రాల వద్ద అవసరమైన ధాన్యం శుభ్రపరిచే ప్యాడీ క్లీనర్లు, క్యాలిపర్స్ ఇతర సామాగ్రి వెంటనే యుద్ధ ప్రాతిపదికన సమకూర్చాలన్నారు. దొడ్డు రకం ధాన్యం సన్న రకం ధాన్యంతో కలువకుండా చూడాలని, సన్న రకం కొనుగోలు కేంద్రాలకు ఎట్టి పరిస్థితుల్లోనూ దొడ్డు రకం ధాన్యం రాకుండా జాగ్రత్తలు తీసుకోవాల న్నారు. కాగా, తాలు, తప్ప పేరుతో రైస్ మిల్లుల వద్ద ధాన్యం నిల్వలలో కోతలు అమలు చేయకుండా చూడాలని, కొనుగోలు కేంద్రాల వద్ద నాణ్యత ప్రమాణాలు పరిశీలించిన తర్వాతే కాంటా చేయాలని, రైతులకు ఎటువంటి నష్టం కలుగకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని సూచించారు. నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా కొనుగోలు కేంద్రాలకు రైతులు ధాన్యం తీసుకువచ్చేలా వారికి అవగాహన కల్పించేందుకు విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. జిల్లాలోని రైస్ మిల్లర్లకు ధాన్యం కేటాయింపు కోసం బ్యాంకు గ్యారంటీ తప్పనిసరి చేస్తూ ప్రభుత్వం నిర్ణయించి ఉత్తర్వులు జారీ చేసిందని, వీటిని కట్టుదిట్టంగా అమలు చేయాలన్నారు. రైస్ మిల్లర్లతో సమావేశాలు నిర్వహించాలని, ప్రభుత్వ ఉత్తర్వులు 27 పై చర్చించాలని, రైస్ మిల్లర్లచే బ్యాంక్ గ్యారంటీ తీసుకుని ధాన్యం కేటాయింపు చేయవచ్చు న్నారు. రైస్ మిల్లర్లు బ్యాంకు గ్యారంటీ సమర్పించని పక్షంలో జిల్లాలో కొనుగోలు చేసిన ధాన్యం భద్రపరిచేందుకు అవసరమైన మేర ఇంటర్మీడియట్ గోడౌన్లను ముందస్తుగానే గుర్తించాలని, ప్రతి జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలకు సంబంధించిన సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు వీలుగా ప్రత్యేక ఫోన్ నెంబర్‌తో కూడిన గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేయాలన్నారు. ధాన్యం విక్రయించిన రైతులకు 48 గంటల్లోపు చెల్లింపులు పూర్తయ్యేలా చూడాలన్నారు. పక్క రాష్ట్రాల ధాన్యం మన కొనుగోలు కేంద్రాలకు రాకుండా సరిహద్దు ప్రాంతాల వద్ద గట్టి నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ సమీక్షలో సంగారెడ్డి జిల్లా నుంచి కలెక్టర్ క్రాంతి వల్లూరు, అదన పుకల్లెక్టర్ మాధురి, జిల్లా వ్యవసాయశాఖ అధికారి శివకు మార్, జిల్లా పౌర సరఫరాల అధికారి శ్రీనివాస్ రెడ్డి, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ కొండలరావు, జిల్లా సహకారశాఖ అధికారి కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. సిద్దిపేట జిల్లా నుంచి జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్, డిఆర్ఓ నాగ రాజమ్మ, అర్డిఓలు చంద్రకళ, రామ్మూర్తి, ముఖ్య ప్రణాళిక అధికారి దశరథ్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి జయదేవ్ ఆర్య, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ ప్రవీణ్, జిల్లా పౌరసరఫరాల అధికారి తనుజ, జిల్లా మార్కెటింగ్ అధికారి నాగరాజు, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

నాల్గొ అంతస్తు పై నుంచి పడి మేస్త్రి మృతి

- మృతుడి కుటుంబానికి రూ.20 లక్షలివ్వాలి
- సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు నాగేశ్వరరావు డిమాండ్
- రూ.7 లక్షలు ఇచ్చేందుకు బిల్డర్ అంగీకారం

నవతెలంగాణ-పటాన్‌చెరు





నాల్గొ అంతస్తు వద్ద పనిచేస్తున్న మేస్త్రీ కాలుజారి కిందపడి మృతి చెందాడు. ఈ ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఇంద్రేశం గ్రామంలో శనివారం ఉదయం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రకాశం జిల్లా రామవరం మండలం వెంకట కృష్ణాపురం గ్రామా నికి చెందిన ఆంజనేయులు(38) కొంతకాలం క్రితం వచ్చి బీరంగూడ మంజీర కాలనీకి కుంటుంబంతో పాటు నివాసం ఉంటున్నాడు. మండలంలోని ఇంద్రేశం, సాయికాలనీలో హర్షవర్ధన్‌కు చెందిన అపార్ట్మెంటులో సుబ్బయ్య మేస్త్రి వద్ద చిన్న మేస్త్రిగా పనిచేస్తున్నాడు. కాగా శనివారం ఉదయం అపార్ట్మెంట్‌లోని నాలుగో అంతస్తు వద్ద పని చేస్తుండగా కాలుజారి కింద పడిపోగా బలమైన గాయాలు తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పూర్వాపరాలను పరిశీలించారు.

విషయం తెలుసుకుని సంఘటన స్థలానికి చేరుకున్న సీఐటీయూ ఉపాధ్యక్షులు నాగేశ్వరరావు.. బహుళ అంతస్తుల నిర్మాణంలో భాగంగా నాల్గొ అంతస్తులో పనిచేస్తూ చనిపోయిన మేస్త్రి ఆంజనేయులు కుటుంబానికి రూ.20 లక్షల నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. మృతిచెందిన కుటుంబాన్ని ఆదుకోవాలని ఆందోళన చేశారు. మృతుడికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారని.. రూ.20 లక్షల ఇవ్వాలని డిమాండ్ చేశారు. గ్రామపంచాయతీ హెచ్ఎండిఏ పర్మిషన్ లేకుండా ఐదంతస్తుల భవనాన్ని ఏ విధంగా నిర్మిస్తున్నారని ప్రశ్నించారు. పంచాయతీ కార్యదర్శి పైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అయితే రూ.7 లక్షలు ఇవ్వడానికి బిల్డర్ హర్షవర్ధన్ రాతపూర్వకంగా అంగీకరించారు. ఒక లక్ష రూపాయలు ఇవ్వటంతో పాటు, మిగతా రూ.6 లక్షలు నెల రోజుల్లోపు చెల్లిస్తామని ఆరు లక్షలకు ఎస్బిఐ బ్యాంకు చెక్కును అందజేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.


దళితుల సంక్షేమం పట్ల ప్రభుత్వాలకు చిత్తశుద్ధి లేదు

దళితులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

ఎస్సీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాల షెడ్యూల్ ప్రకటించాలి

కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మాణిక్

నవతెలంగాణ-సంగారెడ్డి



దళితుల సంక్షేమం పట్ల కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు చిత్తశుద్ధి లేదు అని కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అతిమేల మాణిక్ అన్నారు. కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) సంగారెడ్డి జిల్లా కమిటీ సమావేశాన్ని శనివారం సుందరయ్య భవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా మాణిక్ మాట్లాడుతూ.. దళితుల సంక్షేమం పట్ల కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న వైఖరి సరిగ్గా లేదన్నారు. దళితుల ఆర్థికాభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించడంలో విఫలం అవుతున్నాయన్నారు. దళితుల సామా జిక, ఆర్థిక సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలన్నారు. ప్రధాన మంత్రి మోడీ చెప్పే ఒకే దేశం ఒకే ఎన్నిక రాజ్యాంగ విరుద్ధ మన్నారు. రాజ్యాంగం రిజర్వేషన్ల రక్షణ లౌకిక ప్రజాస్వామ్యం విలువల పరిరక్షణ కోసం ఐక్యంగా ఉద్యమిం చాలన్నారు. ఎన్నికల హామీ మేరకు అంబేద్కర్ అభయ హస్తం ద్వారా రూ.12 లక్షలు ప్రతీ దళిత కుటుంబానికి ఇవ్వాలన్నారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా దళితుల ఆర్థిక అభివృద్ధికి ఉపాధి కల్పనకు అవసరమైన ప్రణాళిక సిద్ధం చేసి అమలు చేయాలన్నారు. రాబోవు కాలంలో దళితుల సమగ్ర అభివృద్ధి కోసం సంఘం తరపున పోరాడుతామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి. అశోక్, జిల్లా ఉపాధ్యక్షులు శివకుమార్, మల్లేశం, రాజు, జిల్లా సహాయ కార్యదర్శులు ప్రవీణ్, దాసు, జిల్లా కమిటీ సభ్యులు దత్తు, జయరాం, ప్రవీణ్, మహేష్, నరేష్, మహేష్, నాయకులు నాగరాజు, ఆనంద్, దశరథ్, రాజేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ ఉపాధి హామీ పనులు త్వరగా పూర్తి చేయాలి

మంత్రి ధనసరి అనసూయ(సీతక్క)

నవతెలంగాణ-సిద్దిపేట కలెక్టరేట్

గ్రామీణ ఉపాధి హామీ క్రింద మంజూరైన పనులు త్వరగా పూర్తి చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి ధనసరి అనసూయ(సీతక్క) జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. శనివారం హైదరాబాద్ రాష్ట్ర సచివాలయం నుంచి ఇందిరా మహిళా శక్తి, రోడ్డు నిర్మాణ పనులపై రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులతో కలిసి మంత్రి దాసరి అనసూయ (సీతక్క) అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, గ్రామాలలో రోడ్ల నిర్మాణం, ఇంకుడు గుంతల నిర్మాణం, మౌళిక వసతుల కల్పన కోసం మంజూరు చేసిన నిధులను మార్చి 2025 లోపు ఖర్చు చేయాలని సూచించారు. మహిళలు ఆర్థికంగా స్థిరపడేందుకు ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం క్రింద ప్రభుత్వం వడ్డీ లేని రుణాలను అందిస్తూ 17 రకాల వ్యాపార యూనిట్ల ఏర్పాటులో అవసరమైన సహాయ, సహకారాలు అందజేస్తున్నామని తెలిపారు. గ్రామాలలో ప్రతి ఇంటిలో టాయిలెట్ ఉండే విధంగా చూడాలని, నూతనంగా నిర్మాణ అవుతున్న ఇండ్లలో స్వచ్ఛ భారత్ మిషన్ క్రింద టాయిలెట్లు నిర్మించాలని పేర్కొన్నారు. గ్రామాలలో అవసరమైన చోట సామూహిక టాయిలెట్ల నిర్మాణం చేపట్టాలని. రాబోయే 4 నెలలో చేపట్టే పనులకు పక్కా ప్రణాళిక తయారు చేయాలని సూచించారు. గ్రామంలో వ్యవసాయ పొలాలకు అవసరమైన రోడ్డు నిర్మాణ పనులను పొలం బాటలు కార్యక్రమం కింద చేపట్టాలని, అవసరమైన మొక్కలు నర్సరీలో పెంచాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నుంచి డిఆర్డిఓ ఇతర అధికారులు పాల్గొన్నారు.

వరి కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

నవతెలంగాణ-చౌటకూర్



మండలంలోని వెండికోల్, పోసానిపల్లి, బొమ్మరెడ్డిగూడెం, ఉపరి గూడెం, బద్రిగూడెం, తాడ్దాన్‌పల్లి గ్రా మాల్లో వరి కొనుగోలు కేంద్రాలను చౌట కూర్ కాంగ్రెస్ పార్టీ మండలా ధ్యక్షుడు నత్తి దశరథ శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో మండల ఏపీఓ శివ లక్ష్మీ, మండల నాయకులు మల్లారెడ్డి, పత్తి రాములు, బాలగౌడ్, ఈశ్వర్, శ్రీహరి, గోవర్ధన్, సీడీఆర్ మండల అధ్యక్షులుభరత్, దేవదాసు తదితరులు పాల్గొన్నారు.

మనూర్ ఎస్ఐగా కోటేశ్వరరావు బాధ్యతల స్వీకరణ



నవతెలంగాణ-మనూర్

మనూర్ నూతన ఎస్ఐగా కోటేశ్వరరావు శనివారం రోజున బాధ్యతలు స్వీకరించారు. ఇంతకుముందు ఇక్కడ విధులు నిర్వహించిన సిహెచ్ రాజశేఖర్ హద్నూర్ పోలీస్ స్టేషన్‌కు బదిలీపై వెళ్లారు. వీఆర్ సంగారెడ్డిలో ఉన్న కోటేశ్వరరావు మనూర్ ఎస్ఐగా బాధ్యత తీసుకున్నారు.

సీపీఐఎం మెదక్ జిల్లా మహాసభల సందర్భంగా తూప్రాన్‌లో భారీ ర్యాలీ



మృతుల కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ

నవతెలంగాణ-మునిపల్లి



మండలంలోని ఖమ్మంపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు బేకరీ సంగమేశ్వర్ తల్లిదండ్రులు బేగరి రాములు, లలితమ్మ.. మంగలి ఆనందం తల్లి ఇటీవల మృతి చెందారు. ఈ విషయం తెలియగానే మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు జైపాల్‌రెడ్డి, పైతర సాయికుమార్, మండల ప్రధాన కార్యదర్శి మంతూరి శశికు మార్ తదితరులు మృతుల కుటుంబాలను శనివారం పరామర్శించారు. అధైర్య పడొద్దని ధైర్యం చెప్పా రు. అనంతరం రైతుబంధు అధ్యక్షుడు కళాలి యాదయ్య గౌడ్ కుమారుడి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వారి వెంట బీఆర్ఎస్ నాయకులు మాణయ్య, యాదయ్య గౌడ్, ఫారుక్ పటేల్, తుడం దుర్గయ్య, నరేష్, జగదీశ్వర్, చీలపల్లి ఎక్బాల్, మౌలానా, నర్సింలు, రాజు సంపత్ తదితరులున్నారు.

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

నవతెలంగాణ-కొండాపూర్



మండల పరిధిలోని అనంతసాగర్ గ్రామానికి చెందిన చింతలచెరువు లక్ష్మయ్య మృతి చెందగా.. ఆయన కుటుంబాన్ని స్థానిక ఎమ్మెల్యే చింత ప్రభాకర్ శనివారం పరామర్శించారు. మృతుని కుమారుడు రాజుకు ధైర్యం కల్పించారు. అదే గ్రామానికి చెందిన అమినోదిన్ వాయిద్ తల్లి మృతి చెందగా.. వారి కుటుంబాన్ని కూడా ఎమ్మెల్యే పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఎమ్మెల్యేతోపాటు బీఆర్ఎస్ మండలాధ్యక్షులు ఎం.విటల్, మండల ప్రధాన కార్యదర్శి గోవర్ధన్ రెడ్డి, మాజీ సర్పంచ్ రుక్మొద్దీన్, జలీల్,రాములు, అజీమ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు బొల్లారం విద్యార్థి ఎంపిక

నవతెలంగాణ-ఐడీఏబొల్లారం



ఐడీఏబొల్లారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థిని నిషా కుమారి రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైందని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు మంగీలాల్ తెలిపారు. 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి మెదక్ జిల్లా అండర్ -17 బాలికల, కబడ్డీ క్రీడా పోటీలు శుక్రవారం సిద్దిపేటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగాయి. ఈ పోటీల్లో సంగారెడ్డి జిల్లా జట్టు నుండి నిషా కుమారి పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబర్చింది. దాంతో కబడ్డీ అండర్ -17 విభాగంలో ఉమ్మడి మెదక్ జట్టుకు ఎంపికయ్యిందని ప్రధానోపాధ్యాయులు చెప్పారు. నేడు మహబూబ్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రాచాలలో జరిగే రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో ఆమె పాల్గొంటుందన్నారు. ఈ సందర్భంగా నిషాను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మంగీలాల్, సిబ్బంది అభినందిస్తూ.. రూ3000 నగదు పారితోషకం అందంచారు. రాష్ట్రస్థాయిలో గెలువాలని సూచించారు. అలాగే కొత్తగా వచ్చిన పీడీ రమేష్‌గౌడ్ కృషిని అభినందించారు.



వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

నవతెలంగాణ-జోగిపేట

ఆందోల్ మండలంలోని రోళ్లపహాడ్, రాసానిపల్లి, అన్నా సాగర్, మన్సన్ పల్లి, సాయిబాన్‌పేట గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వరి కొనుగోలు కేంద్రాలను రాష్ట్ర మార్క్ఫెడ్ డైరెక్టర్ ఎస్. జగన్మోహన్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ మక్త జగన్మోహన్ రెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరై శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులకు ఇబ్బందులు పెట్టకుండా ధాన్యం కొనుగోలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల ఏపిఎం మాణిక్యం, డైరెక్టర్లు మధుసూదన్ రెడ్డి, మల్లేశం యాదవ్, సీసీ లు లక్ష్మి, మణెమ్మ, మమతా, వీరుకుమార్, ఆయా గ్రామాల నాయకులు పాల్గొన్నారు.



సిక్లిగర్ కాలనీలో రూ.50 లక్షలతో సీసీరోడ్డు పనులు

నవతెలంగాణ-జోగిపేట

అందోల్-జోగిపేట మున్సిపల్‌లోని 20వ వార్డులో గల సిక్లీగర్ కాలనీలో రూ.50లక్షలతో సీసీ రోడ్డు పనులను శనివారం ప్రారంభించినట్టు వార్డు కౌన్సిలర్ చందర్ నాయక్ తెలిపారు. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశాల మేరకు వార్డు పరిధిలో లక్షల రూపాయలు వెచ్చించి సీసీ రోడ్డు, మురికి కాలువలు, ఇతర అభివృద్ధి పనులు చేపడుతున్నట్టు చెప్పారు. కాలనీలో రోడ్డు పనులు చేపట్టడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేసినట్టు తెలిపారు.



నారాయణ ఉన్నత పాఠశాలలో ప్రీమియర్ లీగ్ ప్రారంభం

నవతెలంగాణ-సంగారెడ్డి


సంగారెడ్డి పట్టణంలోని నారాయణ ఉన్నత పాఠశాలలో బాలల దినోత్సవం పురస్కరించుకొని నారాయణ ప్రీమియర్ లీగ్‌ను జీఎం గోపాల్ రెడ్డి, ఏజీఎం వల్లి కుమార్, పాఠశాల ప్రిన్సిపల్ లక్ష్మణ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు కూడా ముఖ్యమన్నారు. మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్‌సిఓ కనకరాజు, ఏడి అశోక్ రాజ్, ఏవో అజయ్, పిఈటి సురేష్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.



చంద్రశేఖర్, లక్ష్మీకాంతంల పదవీ విరమణ కార్యక్రమం

నవతెలంగాణ-జోగిపేట

జిల్లా సహకార కేంద్రం బ్యాంక్‌లో జోగిపేటకు చెందిన స్టాఫ్ అసిస్టెంట్ అర్.చంద్రశేఖర్, అసిస్టెంట్ మేనేజర్ లక్ష్మీకాంతం పదవి విరమణ కార్యక్రమం శనివారం సంగారెడ్డిలోని బ్యాంకు ఆవరణలో నిర్వహించారు. బ్యాంకు సీఈఓ శ్రీనివాస్, జీఎంలు వెంకటేష్, జనార్ధన్, డీజీఎం లు విశ్వేశ్వర్, శ్రీనివాస్, ఆక్సాని పల్లి పిఎసిఎస్ చైర్మన్ నరేందర్ రెడ్డి, జోగిపేట కురుమ సంఘం అధ్యక్షులు బీర్ల శంకర్, ఉన్ని సంఘం డైరెక్టర్ మాసవోని లక్ష్మణ్ లతోపాటు బ్యాంకు స్టాఫ్, యూనియన్ నాయకులు పాల్గొని.. శాలువా పూలమాలలతో ఘనంగా సన్మానించారు.



సీఎంకు కృతజ్ఞతలు తెలిపిన విద్యార్థులు

నవతెలంగాణ-జిన్నారం

విద్యార్థులకు ప్రభుత్వం కాస్మెటిక్ డైట్ తదితర చార్జీలు పెంచినందుకు జిన్నారం మండల కేంద్రంలో గల స్థానిక గిరిజన గురుకుల బాలుర పాఠశాల కళాశాల విద్యార్థులు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి మండలికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు అధ్యాపకులు, వైస్ ప్రిన్సిపల్ సిహెచ్ వెంకటయ్య, సుధీంద్ర కమలాకర్ హరిత నరహరి అర్చన శ్వేత ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి

- జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి
- బిచ్చుగూడలో ధాన్యం కొనుగోలు కేంద్రం తనిఖీ
- రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్న కలెక్టర్

నవతెలంగాణ-పటాన్‌చెరు



ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ధాన్యం సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు అధికారులను ఆదేశించారు. పటాన్‌చెరు మండలం బిచ్చుగూడ గ్రామంలో సహకార సంఘాల ఆధ్వర్యంలో నెలకొల్పిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రెవెన్యూ అదనపు కలెక్టర్ మాధురితో కలిసి శనివారం పరిశీలించారు. కొనుగోలు కేంద్రానికి ధాన్యం తెచ్చిన రైతులకు క్రమసంఖ్య ప్రకారం నమోదు చేసుకుని తూకం వేయాలని కొనుగోలు కేంద్రాల ఇన్‌ఛార్జ్‌లను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల వద్ద అవసరమైన ప్యాడీ క్లీనర్‌లను ఏర్పాటు చేయాలన్నారు. ధాన్యం నాణ్యత ప్రమాణాలను పాటించేలా రైతులకు అవగాహన చేయాలన్నారు. ధాన్యం విక్రయించిన రైతులకు వివరాలు ట్యాబ్‌లో వెంటనే నమోదు చేయాలని సూచించారు. కేంద్రానికి ధాన్యం తీసుకువచ్చిన రైతులను పలకరించి, కొనుగోలు కేంద్రాల్లో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా' అని అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రానికి ఎంతమంది రైతులు ధాన్యం తీసుకువచ్చారని వివరాలు కేంద్రం ఇన్చార్జిలను అడిగి తెలుసుకున్నారు. రైతుల సౌకర్యార్థం కేంద్రాల్లో అందుబాటులో ఉంచిన సదుపాయాలను పరిశీలించారు. ధాన్యం సేకరణ ప్రక్రియను సజావుగా జరిగేలా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని, ఎక్కడైనా లోటుపాట్లు ఉంటే సరిచేసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. అకాల వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నందున టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. ఒక బస్తాకి 40 కేజీల కన్నా ఎక్కువ తూకం వేయొద్దని ఆదేశించారు. ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ధాన్యం సేకరణ ప్రక్రియను సజావుగా జరిగేలా అవసరమైన అన్ని చర్యలు తీసు కోవాలని, ఎక్కడైనా లోటుపాట్లు ఉంటే సరిచేసుకోవాలని సూచించారు. మాయిశ్చర్ 17 లోపు వుండేలా చర్యలు తీసుకోవాలని, తాలు తప్ప, రాళ్ళూరప్పలు లేకుండా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. వరి కోత హార్వెస్టర్‌ల వేగం (ఆర్పీఎం) 18 కన్నా ఎక్కువ వేగంతో వరి కోత పనులు నిర్వహించాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయశాఖ అధికారి శివ కుమార్, జిల్లా పౌర సరఫరాల అధికారి శ్రీనివాస్ రెడ్డి, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ కొండలరావు, జిల్లా సహకారశాఖ అధికారి కిరణ్ కుమార్, పీడీ డీఆర్డీఏ జ్యోతి, కేంద్రం నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన నిర్మల జయప్రకాశ్ రెడ్డి

నవతెలంగాణ-సదాశివపేట

మండల పరిధిలో గల కోల్కూర్ గ్రామంలో వడ్ల ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన టీజీఐఐసీ చైర్మెన్ నిర్మల జయప్రకాశ్ రెడ్డి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కాగా రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని నిర్వాహకులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సరస్వతి, ఆర్ఐ గంగాధర్, అగ్రికల్చర్ ఏవో రమేష్, ఆత్మ కమిటీ చైర్మెన్ ప్రభు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సిద్దన్న, మాజీ కోపరేటివ్ చైర్మన్ మాణిక్ రెడ్డి రైతులు పాల్గొన్నారు.

సమగ్ర కుల గణనతో సామాజిక న్యాయం

టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి

నవతెలంగాణ-సంగారెడ్డి



రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే, బీసీ కుల గణనతో బీసీలకు అన్ని అంశాల్లో అవకాశాలు పెరుగుతాయని సంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు, టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి అన్నారు. జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణం అంబేద్కర్ భవన్‌లో ఆమె అధ్యక్షతన శనివారం జరిగిన సమావేశంలో నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవ రెడ్డి, మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కుల గణన సర్వేతో బీసీలకు సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా అవకాశాలు పెరుగుతాయన్నారు. సమగ్ర ఇంటింటి సర్వేతో సేకరించిన వివరాలతో ప్రజల ఆర్థిక పరిస్థితిని అంచనా వేసి వారికి ఉపాధి ఉద్యోగ అవకాశాలు కల్పించే విధంగా ప్రణాళికలు రూపొందించవచ్చన్నారు. బీసీ కుల గణన తర్వాత జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్లు పెరిగి రాజకీయంగా అవకాశాలు పెరుగుతాయని స్పష్టం చేశారు. సమగ్ర కుటుంబ సర్వే ద్వారా తెలంగాణలోని అన్ని వర్గాలకు మేలు చేకూర్చేలా నిర్ణయం తీసుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు, పీసీసీ అధ్యక్షుల నిర్ణయం పట్ల ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కుల గణన తర్వాత సంక్షేమ పథకాలు మరింత వేగవంతమై అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమం అభివృద్ధి అందుతుందని హామీ ఇచ్చారు. ఈ కుల గణన కార్యక్రమాన్ని కాంగ్రెస్ కార్యకర్తలు ప్రతి గడపకు చేరవేయాలని అధికారులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సెట్విన్ చైర్మెన్ గిరిధర్ రెడ్డి, గాలి అనిల్ కుమార్, ఆంజనేయులు, తోపాజీ అనంత కిషన్, పులిమామిడి రాజు, శ్రీనివాస్ రెడ్డి, పుష్ప నగేష్ యాదవ్, వివిధ మండల, బ్లాక్ అధ్యక్షులు, కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వ్యాపారస్తులపై కేంద్ర ప్రభుత్వ పన్ను ఎత్తేయాలి

జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు

నవతెలంగాణ-జహీరాబాద్



వ్యాపారస్తులపై కేంద్ర ప్రభుత్వం వేస్తున్న పన్నులను ఎత్తివేస్తే వ్యాపారస్తులు అందరికీ లాభం కలిగి.. ప్రతి పౌరుడికి అందుబాటులో ధరలు ఉంటాయని ఎమ్మెల్యే మాణిక్ రావు అన్నారు. దీపావళి సందర్భ ంగా వస్త్ర వ్యాపార సంఘం అధ్యక్షులు అల్లాడి వీరేశం గుప్తా, మాజీ మున్సిపల్ చైర్మెన్ అల్లాడి నర్సింలు వ్యాపార సముదాయాల్లో శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక లక్ష్మీపూజ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. అన్నిరంగాల వ్యాపారవేత్తలు విజయ సూచకంగా దీపావళిని నిర్వహిస్తారన్నారు. కులమతాలకు అతీతంగా పండగలను జరపడం జహీరాబాద్ నియోజ కవర్గ ప్రత్యేకత అని గుర్తు చేశారు. అనంతరం అల్లాడి వీరేశం గుప్తా, ఎస్వి షాపింగ్ మాల్ నిర్వాహకులు, మాజీ మున్సిపల్ చైర్మన్ అల్లాడి నర్సింలు , అనిల్ జాజు, వెంకటేశ్వర షాపింగ్ మాల్ నిర్వాహకులు వెంకటేశం గుప్తా, అల్లాడి సాయిరాం, అల్లాడి వంశీ, అంకుష్‌లకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ డిఎస్ఐడిసి చైర్మన్ మహమ్మద్ తన్వీర్, మాజీ మున్సిపల్ చైర్మెన్ మాన్కాల్ సుభాష్ గుప్తా, శ్రీకాంత్ రెడ్డి, ఉమ్మడి మెదక్ జిల్లా డీసీఎంఎస్ చైర్మెన్ శివకుమార్ ,మాజి మార్కెట్ చైర్మన్లు గుండప్ప, రామకృష్ణ రెడ్డి, మాజీ ఆత్మ చైర్మెన్‌లు విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ నియంత్రణ పాటించాలి



నవతెలంగాణ-ఝరాసంగం

తల్లిదండ్రులు కుటుంబ నియంత్రణ కోసం కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని సంగారెడ్డి జిల్లా మహిళ, శిశు సంక్షేమ శాఖ అభివృద్ధి అధికారి లలితా కుమారి అన్నారు. మండల పరిధిలోని క్రిష్టాపూర్,ఝరా సంగం గ్రామంలో కొనసాగుతున్న అంగన్వాడీ కేంద్రాలతో పాటు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను పరిశీలించారు. అంగన్వాడీ కేంద్రాల్లోని పిల్లలకు ప్రతి రెండో, నాల్గో బుధవారాల్లో ఎత్తు బరువులను కొలతలు వేసి రిజిస్టర్ లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలన్నారు. గర్భిణులు మొదటి నెలనుండి ఆరు నెలల వరకు కేంద్రాలలో పౌష్టిక ఆహారం తీసుకోవాలన్నారు. మూడేండ్ల నుంచి ఆరేండ్ల వయసులోపు గల పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపించే విధంగా తల్లిదండ్రులు, అంగన్వాడి టీచర్లు చర్యలు తీసుకోవాలన్నారు. అంతేకాకుండా చైల్డ్ మ్యారేజెస్ జరగకుండా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. వారి వెంట జిల్లా డీహెచ్‌డబ్ల్యు పల్లవి, ఎంపీడీవో సుధాకర్, ఏపీవో రాజ్ కుమార్, అంగన్వాడి టీచర్లు తదితరులు ఉన్నారు.

కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ



నవతెలంగాణ-జిన్నారం

స్థానిక రైతువేదిక వద్ద జిన్నారం తహసీల్దార్ బిక్షపతి, తదితర రెవిన్యూ అధికారుల సమక్షంలో శనివారం ఏర్పాటు చేసిన కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సమావేశంలో మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన 21 మంది లబ్దిదారులకు రూ.21 లక్షల విలువ గల చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా పరిషత్ మాజీ చైర్మెన్ కుంచాల ప్రభాకర్, జిన్నారం మండల పరిషత్ మాజీ అధ్యక్షులు దమ్ము గౌని రవీందర్ గౌడ్, జిన్నారం బ్లాక్, మండలం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దాసరి శ్రీకాంత్ రెడ్డి, వడ్డే కృష్ణ, జిన్నారం మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు మాదారం కలాలి రాజు గౌడ్, యువజన కాంగ్రెస్ అధ్యక్షులు ఎనగండ్ల నరేంద్ర గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నీటిమడుగైన నాగులపల్లి రోడ్డు

నవతెలంగాణ-వట్‌పల్లి



మండలంలోని నాగులపల్లి రోడ్డు నీటి మడుగై ప్రమాదాలకు ఆవాసంగా మారింది. వాహనదారులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ఈ రోడ్డు గుండా ప్రయాణించాల్సిన దుస్థితి నెలకొన్నది.

2014లో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో స్థానిక ఎమ్మెల్యే బాబు మోహన్ నాగులపల్లి రోడ్డు పనులను ప్రారంభించారు. అయితే రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు డబ్బులు ఇప్పించకపో వడంతో పనులకు బ్రేక్ పడి అంతలోనే నిలిచిపోయాయి. 2018 ఎన్నికల్లో గెలిచిన ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ రైతులను ఒప్పించడంతో పనులలో కదలిక రావడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. 300 గజాల రోడ్డు మాత్రమే పూర్తి చేసి వెళ్లిపోయారు. శివాలయం సమీపంలో, సమ్మక్క సారక్క ముందు ఉన్న రోడ్డును పూర్తి చేసేందుకు కంకర డస్టు రూలర్తో చదును చేయించారు. తీరా బీటీ వేసే పని ఒకటి మిగిలి ఉన్న సమయంలో ఆ పనులను అక్కడే వదిలేశారు. దాంతో ఆ రోడ్డు ప్రస్తుతం గుంతలమయంగా మారింది. వట్‌పల్లి నుంచి జోగిపేటకు ఈ రోడ్డు ద్వారా మాత్రమే వెళ్లాలి. దాంతో ఈ రోడ్డుపై ప్రయాణాలు సాగించే వాహనదారులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని రాకపోకలు సాగిస్తున్నారు. ప్రభుత్వాలు మారిన పాలకులు మాత్రం ఈ పనులను పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

అకాల వర్షం.. పత్తి రైతు అతలాకుతలం

నవతెలంగాణ-వట్‌పల్లి



అకాల వర్షాలతో పత్తి రైతులు అతలాకుతలమవుతున్నారు. ఆరుగాలం కష్టించి పండించిన పంట చేతికి వచ్చిన సమయంలో.. అకస్మాత్తుగా పడుతున్న వర్షాలతో పంటవెయ్యత్తం కండ్లముందే తడిసి ముద్దవుతుంటే కన్నీటి పర్యంతమవుతున్నాడు.

మండలంలో ఈ ఏడాది 20,000 ఎకరాలకు పైగానే పత్తి సాగు చేశారు. అయితే ప్రతీయేడు అతివృష్టి, అనావృష్టితో పత్తిరైతులు నష్టపోతూనే ఉన్నారు. దానికితోడు తెగుళ్లతో కోలుకోలేని దెబ్బ పడుతున్నద. ఈసారి కూడా రెండ్రోజుల నుంచి వర్షం దంచికొడుతుంది. దాంతో చేతికొచ్చిన పంట మొత్తం వర్షానికి తడిసిపోతున్నది. కూలీల కొరతతో పత్తి తీత పనుల్లో జాప్యం జరుగుతున్నది. ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూల్, గుంటూరు, అదోని ప్రాంతాల నుంచి బొలెరో వాహనాల్లో చార్జీలను భరిస్తూ కూలీలను ఇక్కడకు తీసుకవస్తున్నారు. కిలోకు రూ.11 నుంచి రూ.12 వరకు చెల్లించి పత్తి తీత పనులను మొదలు పెట్టారు. ఈ క్రమం లో అకాల వర్షాలు దంచి కొడుతుండడంతో పత్తి మొత్తం రైతుల కండ్ల ఎదుటే తడిసిపోతుంది. ఓ పక్క వేలు వెచ్చించి కూలీలను తెప్పిస్తే.. మరోపక్క అకస్మాత్తు వర్షాలతో పంట మొత్తం దెబ్బతింటున్నదని అన్నదాత ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జీపీ కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలి



నవతెలంగాణ-కంగ్టి

గ్రామపంచాయతీల్లో పని చేస్తున్న కార్మికులకు పెండింగ్‌లో ఉన్న జీతాలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ నాయకులు రమేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట పంచాయతీ కార్మికులతో కలిసి శనివారం నిరసన చేపట్టి.. జూనియర్ అసిస్టెంట్ శివకుమార్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం రమేష్ మాట్లాడుతూ..మూడు నుంచి ఆరు నెలలుగా జీతాలు రాకపోవడంతో గ్రామ పంచాయతీ కార్మికులు నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు. వారికి కుటుంబ పోషణ కూడా భారంగా మారుతున్నదన్నారు. తప్పకుండా వారికి ప్రతినెలా ఒకటో తారీకున వేతనం అందించాలన్నారు. అలాగె రిటైర్మెంట్ అయ్యాక వారి కుటుంబ సభ్యులకే ఉద్యోగ అవకాశం కల్పించాలన్నారు. రెగ్యులర్‌గా విధులకు హాజరు కానీ పంచాయతీ కార్యదర్శులపై చర్యలు తీసుకోలన్నారు. లేని యెడల ఉద్యమం చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జీపీ వర్కర్లు పాల్గొన్నారు.

బాధితుడికి ఎల్ఓసీ అందజేత



నవతెలంగాణ-జహీరాబాద్

మండలంలోని తూంకుంట గ్రామానికి చెందిన జీవన్ అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రిలో చేరారు. చికిత్స నిమిత్తం రూ.50వేలు ఖర్చు అవుతుందని వైద్యులు చెప్పగా.. ఆర్థిక స్థోమత లేకపోవడంతో తెలంగాణ రాష్ట్ర సెట్విన్ చైర్మెన్ యన్.గిరిధర్ రెడ్డిని బాధితుడు సంప్రదించాడు. వారు తక్షణమే స్పందించి వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, రోడ్లు అండ్ భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిల సహకారంతో ముఖ్యమంత్రి సహాయ నిధి కింద రూ.50వేల ఎల్వోసీని బాధితుడికి మంజూరు చేయించారు. ఆ ఎల్వోసీని పార్లమెంట్ సీనియర్ నాయకులు డాక్టర్ సిద్దం ఉజ్వల్‌రెడ్డి చేతుల మీదుగా బాధితుడికి శనివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో జహీరాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పి.నర్సింహారెడ్డి, తూంకుంట మాజీ సర్పంచ్ రాజు, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుల తదితరులు పాల్గొన్నారు.

సర్వే నంబర్ 403 ప్రభుత్వ భూములను కాపాడండి

నవతెలంగాణ-సంగారెడ్డి



సంగారెడ్డి పట్టణంలోని రాంచందర్‌రెడ్డినగర్ కాలనీలో సర్వే నంబర్ 403 ప్రభుత్వ భూములను కొందరు ప్రయివేటు వ్యక్తులు కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నారని అంబేద్కర్ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షులు కొండాపురం జగన్ ఆరోపించారు. ఈ మేరకు బస్తీ వాసులతో కలిసి అదనపు జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్‌ని కలిసి శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ భూములను అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఘనంగా రామకృష్ణారెడ్డి జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-జహీరాబాద్

జహీరాబాద్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ రామకృష్ణా రెడ్డి జన్మదిన వేడులకను మాచునూర్ ఫాం హౌస్‌లో శనివారం ఘనంగా నిర్వహించా రు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే మాణిక్యరావు, టీఎస్ ఐడీసీ మాజీ చైర్మెన్ మొహమ్మద్ తన్వీర్, డీసీఎంఎస్ చైర్మెన్ శివకుమార్ లో పాల్గొని కేక్ కట్ చేసి సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రామకృష్ణారెడ్డి జహీరాబాద్ నియోజకవర్గానికి మార్కెట్ కమిటీ చైర్మెన్‌గా, ఆత్మ కమిటీ చైర్మెన్‌గా వివిధ రకాల హోదాలతో సేవలు అందించారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మెన్ అశోక్, షేరి సురేందర్ రెడ్డి, అశోక్ రెడ్డి, సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



చైతన్యంతో మూఢనమ్మకాల నిర్మూలన



నవతెలంగాణ- కౌడిపల్లి : విద్యార్థులు ప్రజలను చైతన్యవంతం చేసినప్పుడే మూఢనమ్మకాలను నిర్మూలించవచ్చని ఎస్సై రంజిత్ రెడ్డి, సైంటిఫిక్ స్టూడెంట్ ఫెడరేషన్ జాతీయ కమిటీ సభ్యుడు ఉప్పులేటి నరేష్ పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు కౌడిపల్లి పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మహాత్మ జ్యోతిరావు పూలే బాలుర గురుకుల పాఠశాల కళాశాలలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వ్యక్తిత్వ వికాసం- సైన్సు-మూఢనమ్మకాల నిర్మూలన అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఎస్సై రంజిత్ రెడ్డి, ఉప్పులేటి నరేష్ హాజరై మాట్లాడుతూ సమాజంలోని మూఢనమ్మకాలను విద్యార్థులు వదిలిపెట్టి శాస్త్రీయ సమాజ నిర్మాణానికి నడుం బిగించాలని. దొంగ స్వాములు భూత వైద్యులు ప్రజల అమాయకత్వాన్ని ఆసరా చేసుకుని ఆర్థికంగా సామాజికంగా మోసం చేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. మూఢనమ్మకాలు లేని శాస్త్రీయ సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. డ్రగ్స్ మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండి ఉన్నత లక్ష్యాలు చేరుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఉప్పులేటి నరేష్ మాంత్రికులు భూత వైద్యులు మోసం చేసే కుట్రలను సైన్స్ మ్యాజిక్ షో ద్వారా విద్యార్థులకు వాటి వెనుక దాగి ఉన్న రహస్యాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ హరిబాబు, ఏటీపీ బాబు, డిప్యూటీ వార్డెన్ లక్ష్మణ్, పోలీస్ సిబ్బంది, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి, కేసు నమోదు

నవతెలంగాణ-నార్సింగి : ఆర్టీసీ బస్సుకు అడ్డుగా నిలిచిన వాహనాన్ని పక్కకు జరపన్నందుకు డ్రైవర్‌పై దాడి చేసిన ఘటన స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలోని కాసులాపూర్ మలుపు వద్ద చోటు చేసుకుంది. ఎస్ఐ అహ్మద్ మొహిఉద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం సిద్దిపేట జిల్లా నంగునూర్ గ్రామానికి చెందిన మాలోత్ లాలూ మెదక్ డిపోలో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. శుక్రవారం ఉదయం 9 గం లకు చెగుంటలోని మోడల్ స్కూల్‌లో చదివే వివిధ గ్రామాల విద్యార్థులను బస్సులో ఎక్కించుకుని చేగుంట వైపు వెళ్లడానికి జాతీయ రహదారి 44పై గల కాసులాపూర్ వద్ద బస్సును యూ టర్న్ తీసుకుంటుండగా కాసులాపూర్ గ్రామానికి చెందిన ఏశబోయిన స్వామి రోడ్డుపై తన పల్సర్ బైక్ అడ్డుగా పెట్టుకుని ఇతరులతో మాట్లాడుతూ నిలబడ్డాడు. బస్సు డ్రైవర్ హారన్ కొట్టినా, పక్కకు జరిగి మాట్లాడుకోమని చెప్పినా జరగకుండా దుర్భాషలాడుతూ బసులోకి జొరబడి డ్రైవర్‌పై భౌతికంగా దాడి చేశాడు. స్వామి చేసిన దాడిలో బస్ డ్రైవర్ లాలూకు గాయాలయ్యాయి. డ్యూటీలో ఉన్న తన పై దాడి చేసి గాయ పరిచిన నిందితునిపై చట్ట రీత్యా చర్యలు తీసుకోవాలని డ్రైవర్ లాలూ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అహ్మద్ మొహిఉద్దీన్ తెలిపారు.

గురుకుల విద్యార్థులకు మెస్ చార్జీలు పెంచడం పట్ల హర్షం



నవతెలంగాణ-హవేలీ ఘనపూర్

తెలంగాణ గురుకుల విద్యార్థుల మెస్ చార్జీలు పెంచినందుకు విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. శనివారం మండలం కేంద్రంలోని బీసీ బాలుర గురుకుల ఇంటర్, డిగ్రీ కళాశాల విద్యార్థులు కేక్ కట్ చేసి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ జనార్దన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు మెస్ చార్జీలు పెంచినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థులకు మెరుగైన పౌష్టికాహారాన్ని సంతృప్తిగా అందిస్తారనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్, డిప్యూటీ వార్డెన్, విద్యార్థులు పాల్గొన్నారు.

4న గ్రంధాలయ చైర్మన్ ప్రమాణ స్వీకారం

జిల్లా నాయకులు చంద్రం కృష్ణ గౌడ్



నవతెలంగాణ-కౌడిపల్లి

గ్రంధాలయ సంస్థ చైర్మన్‌గా నియమితులైన చిలుముల సుహాసిని రెడ్డి ఈ నెల 4వ తేదీన సోమవారం ప్రమాణ స్వీకారం చేయనున్నారని జిల్లా నాయకులు చంద్రం కృష్ణ గౌడ్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ ముఖ్య నాయకులు కాంగ్రెస్ కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గత 12 రోజుల క్రితం గ్రంధాలయ సంస్థ చైర్మన్‌గా చిలుముల సుహాసిని రెడ్డి పేరును ప్రకటించడంతో ప్రభుత్వం సోమవారం రోజు మెదక్ జిల్లా కేంద్ర గ్రంథాలయం వద్ద ఉదయం ప్రమాణ స్వీకారానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రులు కొండ సురేఖ, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ హాజరవుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమానికి మెదక్, నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ కార్యకర్తలు ముఖ్య నాయకులు హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో కౌడ శ్రీనివాస్ గుప్త, అడ్వకేట్ చిరంజీవి, విజయ్ గౌడ్, ఆరిఫ్, పాల్గొన్నారు.

విదేశాల నుంచి వచ్చిన యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతి

తల్లిదండ్రులకు తీరని వేదన



నవతెలంగాణ-వెల్దుర్తి : విదేశాల్లో చదువు పూర్తి చేసుకుని స్వదేశానికి వచ్చి మంచి ఉద్యోగం చేపడతాడనే క్రమంలో శనివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన హైదరాబాద్ సర్కిల్లో సుచిత్ర వద్ద చోటుచేసుకుంది. వెల్దుర్తి మండల పరిధిలో ఆరెగూడెం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు మాజీ సింగిల్ విండో డైరెక్టర్ మైపాల్ రెడ్డి, ఇందిరా దంపతులలకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. చిన్నకుమారుడు వెన్నవరం సాయి కిషోర్ రెడ్డి (24) లండన్‌లో ఎంబీఏ పూర్తి చేసి స్వదేశానికి తిరిగి వచ్చాడు. సాయి కిషోర్ రెడ్డి పని నిమిత్తం శనివారం తెల్లవారుజామున 3:30 గంటల ప్రాంతంలో తన స్నేహితుడితో కలిసి హైదరాబాద్‌కు వెళ్లాడు. సుచిత్ర సర్కిల్‌కు తన ద్విచక్రవాహనంపై వెళ్తున్న క్రమంలో మార్గమధ్యంలో రోడ్డు మధ్యలో ఉన్న వైపుకి స్పీడ్‌గా వెళ్తున్న బైకు తగిలి అదుపుతప్పి పడిపోయాడు. దీంతో తలకు తీవ్ర గాయాలై సాయి కిషోర్ రెడ్డి అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. విదేశాల్లో ఉన్నత చదువులు పూర్తి చేసుకొని ఉద్యోగం చేస్తూ తమను పోషిస్తాడనుకున్న కొడుకు రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందడంతో మహిపాల్ రెడ్డి దంపతుల రోదనలు గ్రామంలో మిన్నంటాయి. గ్రామస్తులు అందర్నీ కంటతడి పెట్టించింది.

కాళికామాతను సందర్శించి బాబా ప్రత్యేక పూజలు



నవతెలంగాణ-వెల్దుర్తి

మండల పరిధి మన్నె వారి జలాల్పూర్ గ్రామ పరిసరాల్లో వెలసిన కాళికామాతను శనివారం శ్రీ జగదాంబ శ్రీ శక్తి పీఠం అధిపతి బ్రహ్మరుసి తాలూరి బనారస్ బాబా సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాళికా మాత ఆశ్రమం గోశాల వద్ద నిత్యాన్నదానంను ప్రారంభించారు. ఈ సందర్భంగా భక్తులకు అమ్మవారి ప్రవచనాలను వినిపించారు. శక్తిపీఠం పీఠాధిపతి వ్యవస్థాపకుడు సత్యనారాయణతో పాటు భక్తులకు కాళికా మాత మహిమల గురించి వివరించారు. నిత్య దూప దీప నైవేద్యం ఆచరించాలని సూచించారు. ఇలా నిత్యం కొనసాగితే అమ్మవారి కటాక్షం అందరికీ ఉంటుందన్నారు. ఇలాంటి శక్తి పీఠాలు దేశంలోని ఒక్కొక్కటిగా దర్శనమిస్తాయన్నారు. శక్తి పీఠాల వలన గ్రామాల్లో పట్టణాల్లో మనశ్శాంతి, ప్రశాంతత ఉంటుందని సూచించారు. ఈ కార్యక్రమంలో వెల్దుర్తి మహిళా అధ్యక్షురాలు ముక్తా బాయ్‌తో పాటు మహిళలు మరికొందరు ఉన్నారు.

ఎల్ఓసీని అందజేసిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-నార్సింగి

మండల పరిధిలోని శేరిపల్లి గ్రామానికి చెందిన నేరెళ్ల శంకర్ కుమార్తె నిత్యశ్రీ అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. విషయాన్ని శేరిపల్లి కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు దృష్టికి తీసుకెళ్లారు. సానుకూలంగా స్పందించిన రోహిత్ శనివారం సీఎంఆర్ఎఫ్ నిధుల నుంచి నిమ్స్ ఆస్పత్రికి లక్షా యాభై వేల ఎల్ఓసిని మంజూరు చేయించి అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా ప్రభుత్వమని, తాను తన పార్టీ బాధితులకు, పేదలకు ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందన్నారు. ఎల్ఓసీ అందుకున్న శంకర్ నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యేకు, సహకరించిన కాంగ్రెస్ పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ మెదక్ జిల్లా అధ్యక్షుడు జంగర్ల గోవర్ధన్, మాజీ ఎంపీపీ అరుణ ప్రభాకర్, తాళ్ల చిన్న కృష్ణ గౌడ్, సంధిగారి నరసింహులు గౌడ్, శ్రీరామ్ మల్లేశం, యూత్ నాయకులు బాలకృష్ణ గౌడ్, మోతిలాల్, భాను లు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలోకి మాజీ డిగ్రీ కళాశాల అధ్యాపకుడు



నవతెలంగాణ-హవేలీ ఘనపూర్

మెదక్ డిగ్రీ కళాశాల అధ్యాపకునిగా గతంలో కొనసాగిన డాక్టర్ జవ్వాజి విజయ్ కుమార్ మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో శనివారం చేరారు. మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా విజయ్ కుమార్ మాట్లాడుతూ యువత కోరిక మేరకు రాజకీయాల్లోకి రావాలని కోరితే తన డిగ్రీ కళాశాల అధ్యాపక పదవికి రాజీనామా చేసి సుమారు ఆరు నెలల కాలం నుంచి గ్రామంలో పలు సంక్షేమ కార్యక్రమాల్లో తన వంతు కృషి చేయడం జరిగిందన్నారు. వరంగల్ కాకతీయ యూనివర్సిటీ 2010-2012 అధ్యక్షునిగా బాధ్యతలు స్వీకరించానన్నారు. ఆయనతో పాటు ఫరీద్‌పూర్ గ్రామస్తులు మోడబోయిన శ్రీనివాస్, గట్టు రాములు, దేవ సహాయం, చింతల రాములుతోపాటు అనేక మంది కాంగ్రెస్‌లో చేరారు.

ఉత్సాహభరితంగా ప్రారంభమైన సీపీఐఎం జిల్లా మహాసభలు

మహిళలపై దాడులు చేసే వారికి బీజేపీ మద్దతు



దేశవ్యాప్తంగా మహిళలకు అండగా ఎర్రజెండా


సీపీఐఎం రాష్ట్ర కమిటీ సభ్యులు జయలక్ష్మి

నవతెలంగాణ-తూప్రాన్

దేశంలో మహిళలపై దాడులు చేసే వారికి బీజేపీ మద్దతునిస్తుందని, దేశవ్యాప్తంగా మహిళలకు ఎర్రజెండా అండగా ఉంటుందని సీపీఐఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు జయలక్ష్మి తెలిపారు. తూప్రాన్ పట్టణంలో రెండు రోజుల పాటు నిర్వహించే మెదక్ జిల్లా 15వ మహాసభలు శనివారం లింగారెడ్డి గార్డెన్‌లో ప్రారంభమయ్యాయి. పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.మల్లేశం అధ్యక్షతన నిర్వహించిన బహిరంగ సభకు ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలపై అత్యాచారాలు, యాసిడ్ దాడులు, లైంగిక వేధింపులు చేసిన వారిపై నిర్భయ చట్టాన్ని కఠినంగా అమలు చేయకుండా నిర్వీర్యం చేసే ప్రయత్నం చేస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం మహిళలపై దాడులు చేసే వారికే మద్దతిస్తుందని తీవ్రమైన విమర్శలు చేశారు. .రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరువైందని, అర్ధరాత్రి, పగలు సమయాలలో రోడ్డుపై బయటికి వెళ్లాలంటే భయభ్రాంతులకు గురయ్యే ప్రమాదం నెలకొందన్నారు. మహిళలకు చట్టసభల్లో అధిక రిజర్వేషన్లు కల్పించి న్యాయం చేయాలన్నారు. పశ్చిమబెంగాల్ రాష్ట్రంలో యువ మహిళా డాక్టర్‌పై అత్యాచారం చేసి, హత్య చేసిన దుండగులను ఇప్పటివరకు శిక్షించలేకపోవడం మహిళా లోకానికి తీవ్రమైన బాధ కలిగిస్తుందన్నారు. భవిష్యత్తులో అలాంటి సంఘటనలు పాల్పడే వారికి భయపడే పరిస్థితి ప్రభుత్వాలు తీసుకురావాలన్నారు. మహిళలకు ఎల్లప్పుడూ రక్షణ కల్పించడానికి, మద్దతు ఇవ్వడానికి ఎర్రజెండా అండగా ఉంటుందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం హైడ్రా,మూసీ సుందరీకరణ పేర్లతో రాష్ట్ర ప్రజలను తప్పుదోవ పట్టిస్తుందన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రజల ఆకాంక్షలకనుగుణంగా సుపరిపాలన అందించే చర్యలు చేపట్టాలని సూచించారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అర్హులైన లబ్ధిదారులను అధికారులు నిజాయితీగా ఎంపిక చేయాలన్నారు. రాష్ట్రంలో పారిశ్రామిక ప్రాంతాల్లో పనిచేసే కార్మికులు, మహిళా కార్మికుల పక్షాన సిపిఎం(ఐ) నిర్విరామంగా పోరాటం చేస్తుందన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు రంగాలలో పనిచేసే మహిళా కార్మికులకు అందాల్సిన హక్కులను కార్మిక శాఖ ద్వారా అమలు చేయాలన్నారు.

పోరాడే శక్తి ఎర్రజెండాకు ఉంది:

గొల్లపల్లి జయరాజు, సంగారెడ్డి జిల్లా కార్యదర్శి



ప్రజల సమస్యల పరిష్కారం కోసం పోరాడే శక్తి ఒక్క ఎర్రజెండాకు మాత్రమే ఉందని సీపీఐఎం సంగారెడ్డి జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు అన్నారు. మెదక్ జిల్లా మహాసభలకు హాజరైన ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల్ని తిప్పికొడుతూ దేశవ్యాప్తంగా సీపీఐఎం అనేక పోరాటాలు చేస్తోందన్నారు. బీజేపీ ఎలక్షన్ బాండ్ల పేరిట వేల కోట్ల అవినీతికి పాల్పడిందని విమర్శించారు. రాష్ట్రంలోనూ అధికారంలో ఉన్న కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీల్ని విస్మరించి పాలిస్తుందన్నారు. ఏడాది కావస్తున్నా ఇప్పటికీ ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో ఏ ఒక్కటి కూడా పూర్తిగా అమలు చేయట్లేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల పట్ల అనుసరిస్తున్న విధానాల్ని తిప్పికొడుతూ రాబోయే కాలంలో సమరశీల పోరాటాలు సాగించేందుకు ఎర్రజెండా సిద్ధం కావాలన్నారు.



ఎర్ర జెండాది పోరాటాల చరిత్ర:

ఆముదాల మల్లారెడ్డి, సిద్దిపేట జిల్లా కార్యదర్శి



ఎర్రజెండాకు ఎన్నో పోరాటాల చరిత్ర ఉందని సీపీఐఎం సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి అన్నారు. మెదక్ జిల్లా మహాసభ ప్రారంభ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. భూమి, భుక్తి, వెట్టిచాకిరి విముక్తి కోసం నిజాంకు వ్యతిరేకంగా ఎర్రజెండా పోరాడిన ఫలితంగా వేలాది గ్రామాల్లో గ్రామ రాజ్యాలు ఏర్పడ్డాయన్నారు. అనాటి వారసత్వాన్ని కొనసాగిస్తు ప్రజల పక్షాన పోరాడుతున్న పార్టీ ఒక్క సీపీఐఎం మాత్రమేనన్నారు. పేదలకు భూమి పంపిణీ చేయాలని పోరాడి అనేక మందికి భూములు దక్కేలా పోరాటాలు చేశామన్నారు. ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా ఎర్రజెండా మరింత సమరశీల పోరాటాలకు నాయకత్వం వహించాల్సి ఉందన్నారు. మెదక్ జిల్లా మహాసభల్లో ప్రతినిధులు భవిష్యత్ పోరాట కర్తవ్యాలను ఎంచుకుని నిర్వహించే పోరాటాలకు సిద్దిపేట జిల్లా సీపీఐఎం కమిటీ అండగా ఉంటుందన్నారు.

కార్మికులకు కనీస వేతనం 26 వేలు ఇవ్వాలి

జె.మల్లిఖర్జున్ సీఐటీయు రాష్ట్ర ఉపాధ్యక్షులు



రాష్ట్రవ్యాప్తంగా పరిశ్రమలలో పనిచేసే కార్మికులకు 26 వేల రూ.లు కనీస వేతనం ఇవ్వాలని సిఐటీయు రాష్ట్ర ఉపాధ్యక్షులు జే.మల్లికార్జున్ అన్నారు.. ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం 5 సంవత్సరాల ఒకసారి కనీస వేతన చట్టాన్ని సవరణ చేయకుండా,కార్మికుల కోసం ఏర్పడిన కనీస వేతన చట్టాన్ని నిర్వీర్యం చేస్తుందని విమర్శించారు.దేశం,రాష్ట్రంలో పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచే అధికారం ప్రభుత్వాలకు ఉంటుందని పేర్కొన్నారు. కార్మిక శాఖ ఆధ్వర్యంలో కార్మికులకు అందాల్సిన అన్ని రకాల ప్రయోజనాలను అందించే విధంగా కార్మిక శాఖ అధికారులు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

అన్నదాతలకు అండగా ఎర్రజెండా

సీపీఎం(ఐ) మెదక్ జిల్లా కార్యదర్శి ఎ.మల్లేశం



జిల్లాలోని భూ పోరాటాల ఉద్యమంలో సిపిఐ (ఎం) పార్టీ ఎర్రజెండా ముందుంటుందని సీపీఎం(ఐ) మెదక్ జిల్లా కార్యదర్శి ఎ.మల్లేశం అన్నారు. ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ ప్రైవేటు రంగాలలో పనిచేసే కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్, పారిశ్రామిక కార్మికుల సమస్యలపై సిపిఐఎం ఎర్రజెండా ఆధ్వర్యంలో నిరంతరం ఉద్యమిస్తున్నామన్నారు. కార్మికుల హక్కులను సాధించుకోవడానికి పోరాటాలు చేస్తున్నామన్నారు. పారిశ్రామిక ప్రాంతాల్లో ప్రమాదవశాత్తు కార్మికులు మరణిస్తే వారి శవాలను గుర్తు చప్పుడు కాకుండా కొంతమంది రాజకీయ అండదండలతో కార్మికుల స్వస్థలాలకు శవాలను పంపించడం పట్ల రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్రమైన విమర్శలు చేశారు. ఉమ్మడి జిల్లాలో ఒక్కరే కార్మిక శాఖ అధికారిగా కొనసాగుతున్నారు అన్నారు. పరిశ్రమల్లో పనిచేసే కార్మికులకు ఈఎస్ఐ,పిఎఫ్,బోనస్, కార్మికుల పర్మనెంట్ వంటి సౌకర్యాలు కల్పించడానికి ఎర్రజెండా ఉద్యమిస్తుందన్నారు.

రైతులకు రైతు భరోసా కల్పించని ప్రభుత్వం

పద్మ , వ్యవసాయ సంఘం రాష్ట్ర నాయకురాలు



రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అందించాల్సిన రైతు భరోసా పెట్టుబడి సాయానికి రైతు భరోసా కల్పించకుండానే రైతులను మోసం చేస్తుందని వ్యవసాయ కార్మిక సంఘం నాయకురాలు పద్మ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వాన్ని విమర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వం రైతుబంధు పేరుతో ఇచ్చిన పెట్టుబడి సాయాన్ని ఇవ్వకుండా, పెట్టుబడి సాయాన్ని పెంచుతామని ఎన్నికల హామీలు చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుబంధు పథకానికి రైతు భరోసాగా పేరు మార్చి రైతులను మోసం చేస్తుందని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం 2 లక్షల రుణమాఫీ అమలు చేశామని గొప్పగా చెప్పుకుంటున్న ప్రభుత్వ పెద్దలు,రాష్ట్రంలోని రైతులకు పూర్తిస్థాయిలో రుణమాఫీ అమలు చేయకుండా మోసం చేసిందన్నారు.

అమ్ముకున్న ధాన్యం.. మిల్లర్ల చేతివాటం



- కొనుగోళ్ళు ప్రారంభించకుండా మిల్లర్లకు సహకరిస్తున్న ప్రభుత్వం..?
- ధర తక్కువ, తూకంలో, తరుగు పేరుతో రైతులను మోసం చేస్తున్న వైనం
- రైతులతో ప్రభుత్వం, రైస్ మిల్లర్ల దోబూచులాట

నవతెలంగాణ-రామాయంపేట

ప్రజలను మభ్యపెట్టేందుకు ప్రభుత్వం-రైస్ మిల్లర్లు "నేను కొట్టినట్టు చేస్తా-నువ్వు ఏడ్చినట్టు చేయు" అన్న చందంగా రైతులతో దోబూచులాడుతున్నాయి. గత సంవత్సరం ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేసి రైస్ మిల్లర్లకు అప్పగించింది. ప్రభుత్వం అప్పగించిన రైస్ మిల్లుల్లో ఉండాల్సిన కోట్లాది రూపాయల వరి ధాన్యం, ఇప్పటికే అమ్ముకొని రైస్ మిల్లర్‌లు సొమ్ము చేసుకున్నారు. ఈసారి ధాన్యం రైస్ మిల్లులకు ఇవ్వాలంటే, డిపాజిట్ చెల్లించాలని, లేనిపక్షంలో బ్యాంకు గ్యారంటీ ఇవ్వాలని అంటూ మిల్లర్లకు నిబంధనల పేరుతో ప్రభుత్వం ఈ ఖరీఫ్ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించడం ఆలస్యం చేసింది. రైతుల నుంచి రైస్ మిల్లర్లు అమ్ముకున్న ధాన్యాన్ని నింపుకోనే విధంగా సహకరిస్తుందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ప్రారంభం ఆలస్యం కావడంతో, పంట కోసి ఆరబోసిన రైతులకు, వర్షం వెంటాడడంతో, ధాన్యం తడిసిపోతుందన్న భయంతో, నష్టానికైనా అమ్ముకోవడానికి రైతులు రైస్ మిల్లుల బాట పట్టారు.

ఒక్కొక్క రైస్ మిల్ అమ్ముకున్న ధాన్యం రూ.10కోట్లు..?

గత సంవత్సరం ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల నుండి సేకరించిన ధాన్యాన్ని, ప్రభుత్వం రైస్ మిల్లర్లకు అప్పగించగా, జిల్లాలోని చాలా వరకు రైస్ మిల్లుల్లో నిలువ ఉండాల్సిన కోట్లాది రూపాయల వరి ధాన్యాన్ని మిల్లర్లు అమ్ముకొని సొమ్ము చేసుకున్నారు. ప్రభుత్వ సొమ్ముతో కొనుగోలు చేసిన వరి ధాన్యం, ఒక్కొక్క రైస్ మిల్ యాజమాన్యం రూ.10 కోట్ల వరకు అమ్ముకొని, వ్యక్తిగత వ్యాపారాలు, రియల్ ఎస్టేట్ వ్యాపారాలు, ఆస్తులపై పెట్టుబడులు పెట్టుకున్నట్టుగా పెద్ద ఎత్తున ప్రచారం సాగుతుంది. ప్రభుత్వం నుంచి తీసుకున్న వరి ధాన్యం, తిరిగి బియ్యం రూపంలో ఇవ్వాల్సి ఉండగా, మిల్లర్ల వద్ద సరిపడ వరి ధాన్యం లేదు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు ఆలస్యం అవ్వడమే అదునుగా, రైతుల నుంచి రైస్ మిల్లర్‌లు పెద్ద ఎత్తున వరి ధాన్యం కొనుగోళు ప్రారంభించారు.

ధర తక్కువ, తూకంలో, తరుగు పేరుతో మోసం చేస్తున్న మిల్లర్లు



రైస్ మిల్లర్లు, దళారులు ధాన్యానికి మార్కెట్లో కన్నా తక్కువ ధర చెల్లించడమే కాకుండా తరుగు పేరుతో, తూకం పేరుతో, ఇతర మార్గాలలో రైతులను మోసం చేస్తున్నారని, గతంలో ప్రభుత్వాలు, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాయి. నేరుగా ప్రభుత్వమే మద్దతు ధర చెల్లించి, ఎలాంటి తరుగు లేకుండా రైతులకు పూర్తిస్థాయిలో డబ్బులు చెల్లించేవి. కానీ ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు ఆలస్యం అవ్వడమే అదనుగా, రైస్ మిల్లర్లు, దళారులు రైతులను నిలువునా మోసం చేస్తున్నారు. వరి ధాన్యానికి ప్రభుత్వ మద్దతు ధర రూ.2300 ప్రకటించగా, మిల్లర్లు, మధ్య దళారులు రూ. 2200 మాత్రమే రైతులకు చెల్లిస్తున్నారు. ధర తగ్గించడమే కాకుండా, తరుగు పేరుతో ఒక కేజీ బరువును తగ్గిస్తున్నారు. అలాగే తూకంలో కూడా మోసం జరిగే అవకాశం ఉందని తెలుస్తోంది.

ఇప్పటికైనా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి, రైతులకు మద్దతు ధర అందించే విధంగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అలాగే ప్రభుత్వం కొనుగోలు చేసి రైస్ మిల్లులకు అప్పగించిన ధాన్యాన్ని అమ్ముకొని సొమ్ము చేసుకున్న రైస్ మిల్లర్లపై చర్యలు తీసుకోవాలనే డిమాండ్లు వినిపిస్తున్నాయి.

ధర తక్కువైన అమ్ముకోక తప్పదు

రైతు బత్తుల నర్సింలు, ప్రగతి ధర్మారం



ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడంతో, ధర తక్కువైన రైస్ మిల్లులో అమ్ముకోక తప్పడం లేదు. వరి కోసి ధాన్యం ఆరబోసిన తరువాత, కొనుగోలు కేంద్రాలు ప్రారంభం అయ్యేవరకు ధాన్యం నిలువ ఉంచుకోవడానికి స్థలం లేదు. వర్షాలు పడుతున్నాయి. తడిసిపోతే తీవ్రంగా నష్టపోతాం. మొత్తానికి మొత్తం నష్టపోయే దానికన్న, కొంత నష్టమైనా సరే రైస్ మిల్లులో అమ్ముకుంటాం.

ధాన్యం కొనుగోలు చేయకపోతే ధర్నాలు చేస్తాం

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు మాజీ ఎమ్మెల్యే ఎం పద్మ దేవేందర్ రెడ్డి



నవతెలంగాణ-మెదక్ టౌన్

కొబ్బరికాయలు కొడుతూ కొనుగోలు కేంద్రాలు ప్రారంభించడం కాదు త్వరితగతిన అకాల వర్షాల నుంచి రైతులను ఆదుకుని ధాన్యాన్ని తూకం వేసి కర్షకులను ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి కోరారు. సోమవారం నుండి కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తూకం చేయకపోతే బీఆర్ఎస్ పార్టీ శ్రేణుల తరఫున అన్నదాతల పక్షాన నిలబడి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ చేస్తామని చెప్పి పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయకుండా రైతులను నిండా ముంచిందన్నారు. రైతు భరోసా ఇవ్వకుండా రైతులను నట్టేట ముంచిందన్నారు. కాంగ్రెస్ పార్టీని నమ్మి రైతులు ఓట్లేస్తే ఆరు కాలం రైతులు కష్టపడి పండించిన పంటను కూడా ప్రభుత్వం కొనుగోలు చేయకుండా రైతులకు చుక్కలు చూపిస్తున్నారని ఆరోపించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వెనువెంటనే కొనుగోలు కేంద్రాల ప్రారంభించి త్వరితగతిన ధాన్యం తూకం వేసి 72 గంటల్లో రైతుల ఖాతాలో నగదు జమ చేశామని గుర్తు చేశారు. సన్న నరకానికి రూ. 500 బోనస్ ఇవ్వడం దేవుడెరుగు, అసలు ధాన్యమే కొనడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు టపారియన్ కవర్లు ఇవ్వకపోవడం ద్వారా ధాన్యం అకాల వర్షాలకు తడచి ముద్దయి మొలకలు వస్తున్నాయన్నారు. దీని వలన రైతులు క్వింటాళ్ల కొద్దీ ధాన్యం నష్టపోతున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి తడిసిన మొలకెత్తిన ధాన్యాన్ని కొనుగోలు చేసి గిట్టుబాటు ధర కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

బీహార్ కూలి శవం తరలించేందుకు ఎమ్మెల్యే ఆర్థిక సహాయం



నవతెలంగాణ-పాపన్నపేట

క్షణికావేశంతో ఆత్మహత్య చేసుకున్న బీహార్ కూలి శవాన్ని స్వంత గ్రామానికి తరలించేందుకు మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు రూ.25 వేల ఆర్థిక సహాయం చేసి మానవత్వాన్ని చాటుకున్నారు. బీహార్ రాష్ట్రం, మధ్యపూర్ జిల్లా పార్వతీపూర్ గ్రామానికి చెందిన ముఖేష్ (38) పనుల నిమిత్తం పాపన్నపేట మండలం డాక్యా తండాకు వచ్చాడు. అక్కడ ధాన్యం కొనుగోలు కేంద్రంలో పని చేస్తున్నాడు. శనివారం మధ్యాహ్నం బీహార్‌లో ఉన్న భార్యతో సెల్ ఫోన్లో మాట్లాడుతుండగా, మాటా మాటా పెరిగి తీవ్ర ఆవేశానికి లోనయ్యాడు. వెంటనే అక్కడి నుంచి పరుగెత్తి సమీపంలో ఉన్న చెట్టుకు ఉరి వేసుకున్నాడు. తోటి వారు వెళ్ళే నరికి మరణించాడు. చేతిలో చిల్లి గవ్వ లేని సహచరులు, శవాన్ని అతని కుటుంబీకులకు ఎలా అప్ప జెప్పాలో తెలియక సతమతమవుతున్న విషయాన్ని తెలుసుకున్న జిల్లా కాంగ్రెస్ కిసాన్ సెల్ అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి, మండల శాఖ అధ్యక్షులు గోవింద్ నాయక్, మాజీ ఎంపిటీసి రాము, హీరాలాల్, ప్రేం, ఖలీం తదితరులు సంఘటనా స్థలికి చేరుకొని, ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావుకు విషయాన్ని తెలిపారు. వెంటనే ఆయన స్పందించి శవాన్ని స్వగ్రామానికి తరలించేందుకు రూ.25 వేలు అందజేశారు. ముఖేష్‌కు భార్య నలుగురు ఆడపిల్లలు, ఇద్దరు మగ పిల్లలు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-మనోహరాబాద్

మనోహరాబాద్ మండలంలోని చెట్ల గౌరారం సబ్ స్టేషన్‌లో మెయింటెనెన్స్‌లో భాగంగా ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని మనోహరాబాద్ ఏఈ కృష్ణ తెలిపారు. చెట్ల గౌరారం, మీనాజ్పేట్ సబ్ స్టేషన్లలో మెయింటెనెన్స్‌తో పాటు విద్యుత్ అంతరాయం లేకుండా ఉండేందుకు చెట్ల నరికివేత కార్యక్రమం ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సబ్ స్టేషన్ పరిధిలోని చెట్ల గౌరారం, రంగయ్యపల్లి, కోనాయిపల్లి పిటి, ధర్మరాజు పల్లి, వెంకటాపూర్ అగ్రహారం గ్రామాలలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం మూడున్నర గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, ప్రజలు సహకరించాలని విద్యుత్ ఏఈ కృష్ణ వినియోగదారులను కోరారు.

కోర్టు కేసు ఉన్న భూ వ్యవహారంలో పోలీసుల జోక్యం సరికాదు

ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షులు కుర్ర ప్రభాకర్



నవతెలంగాణ -కొల్చారం

కోర్టు కేసు ఉన్న భూవ్యవహారంలో పోలీసులు జోక్యం చేసుకోవడం సరికాదని ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షులు కుర్ర ప్రభాకర్ అన్నారు. శనివారం కొల్చారం మండలం రంగంపేటలో భూ బాధితులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మండలంలోని రంగంపేట గ్రామానికి చెందిన వంజరి నర్సింగరావుకు సర్వే నెంబర్ 205లో 1978వ సంవత్సరంలో 35 గుంటల భూమి కొనుగోలు చేశాడు. అందులో రైస్ మిల్ నిర్మాణం కోసం 20 గుంటల భూమిని నాలా కన్వెన్షన్ చేసి సుమారు 20 సంవత్సరాల క్రితమే రైస్ మిల్ నిర్మించి నడుపుతున్నాడు. కాగా గత మూడు నెలలుగా అతనికి భూమి అమ్మిన అదే గ్రామానికి చెందిన వ్యక్తి వారసులు ఓ మంత్రి వద్ద పని చేస్తున్నందున అదే అదునుగా భావించిన సదరు వ్యక్తులు తమకు రైస్ మిల్ నిర్మించిన స్థలంలో ఇంకా భూమి వస్తుందంటూ రైస్ మిల్ నడవకుండా గత మూడు నెలలుగా ముళ్ళ కంచె వేస్తూ అడ్డుకుంటున్నారని తెలిపారు. దీంతో మిల్లు యజమాని రెవెన్యూ, పోలీసు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని ఆరోపించారు. శనివారం ఇదే వ్యవహారంపై మెదక్ డిఎస్పి ప్రసన్న కుమార్, సీఐ రాజశేఖర్ రెడ్డి, డీఏ లక్ష్మీ సుజాత, తహశీల్దార్ గఫ్ఫార్, ఎస్సై మహమ్మద్ గౌస్‌లు రంగంపేటకు చేరుకుని నర్సింగరావు కుటుంబ సభ్యులను బెదిరింపులకు గురి చేసినట్లు తెలిపారు. కోర్టు ఆర్డర్ ఉన్నప్పటికీ భూ వ్యవహారంలో పోలీసులు జోక్యం చేసుకోవడమేంటని ప్రశ్నించారు. రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి దగ్గర తప్పుడు సమాచారం ఇచ్చి కొందరు వ్యక్తులు రాజకీయంగా నర్సింగరావు కుటుంబ సభ్యులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తూ భూమిని లాక్కునేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. బహుజనులకు అన్యాయం జరక్కుండా చూడాల్సిన బాధ్యత మంత్రిపై ఉందన్నారు. భూమికి సంబంధించిన డాక్యుమెంట్స్ పత్రాలు పూర్తిస్థాయిలో ఉన్నప్పటికీ నర్సింగరావు కుటుంబ సభ్యులను ఇబ్బందులకు గురి చేయడం సరైనది కాదన్నారు. బహుజన వాదులకు అన్యాయం జరిగితే ఎమ్మార్పీఎస్ తరఫున పోరాటం చేస్తామని హెచ్చరించారు.

గృహాల జాబితా సక్రమంగా నమోదు చేయాలి

జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



నవతెలంగాణ-హవేలీ ఘనపూర్

గృహాల జాబితా సమగ్రంగా నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ఎన్యుమరేటర్లకు సూచించారు. మండల కేంద్రంలోని మొదటి వార్డ్‌లో ఆయన పర్యటించారు. సామాజిక, ఆర్థిక, విద్య ,ఉపాధి, రాజకీయ, కుల సర్వే ప్రక్రియలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే హౌస్ లిస్టింగ్ ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. క్షేత్రస్థాయిలో గృహ యజమానులతో మాట్లాడుతూ మీ ఇంట్లో ఎంతమంది ఉంటున్నారు ఒకే ఇంట్లో ఉంటూ వేరువేరుగా వంట చేసుకుంటున్నారా, వీటన్నిటిని స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఒకే ఇంట్లో ఉంటూ వేరువేరుగా వంట చేసుకునే వారికి సపరేట్‌గానే సర్వే నిర్వహించాలన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మండలంలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే లో భాగంగా 11 వేల 11 కుటుంబాలు నివాసం ఉంటున్నాయని 76 ఎన్యుమరేటర్లు 76 బ్లాక్లుగా ఏర్పాటు చేసుకుని 08 మంది సూపర్వైజర్లను నియమించుకున్నట్లు తెలిపారు. హౌస్ లిస్టింగ్ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలని, హౌస్ లిస్ట్ నమోదు చేసిన వెంటనే ఇంటికి స్టిక్కర్ అతికించాలని సూచించారు. గ్రామాలలో సర్వే నిర్వహించినప్పుడు ముందుగా ప్రజలకు తెలియజేసేలా అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సింధు రేణుక, ఎంపీడీవో రామేశ్వర్ గౌడ్,ఎన్యుమరేటర్లు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమిష్టిగా ముందుకు వెళ్ళండి

-మాజీమంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు

నవతెలంగాణ- గజ్వేల్



గజ్వేల్ నియోజకవర్గం లో పార్టీ కార్యకర్తలు సమిష్టిగా ముందుకు వెళ్లాలని మాజీ మంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు అన్నారు. దీపావళి పండుగ సందర్భంగా శనివారం హైదరాబాదులో క్యాంప్ ఆఫీస్‌లో కలిసి స్వీట్లు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీని బలోపేతం చేయాలని కోరారు. మున్సిపల్ పరిధిలో పార్టీ కార్యక్రమాలను ముందుకు తీసుకుపోవాలని సూచించారు. అధికారం లేకున్నా ఉన్న ప్రజల మధ్యన ఉండాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ సంక్షేమ పథకాల విషయంలో ప్రజలకు ఎంతవరకు అందుతున్నాయని తెలుసుకొని ప్రచారం చేయాలన్నారు. ప్రభుత్వం అన్ని విధాల విఫలమైందని ప్రజలకు వివరించాలన్నారు. గత పది ఏండ్లుగా రాష్ట్రంలో అభివృద్ధి జరిగిన విషయాన్ని అదేవిధంగా గజ్వేల్ నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి ఫలాలను ప్రజలకు వివరించాలని కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రభుత్వాల మధ్య తేడాను ప్రజలకు వివరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్ నేతి చిన్న రాజమౌళి, గజ్వేల్ అధ్యక్షులు బెండ మధు, కౌన్సిల్ సభ్యులు ఉప్పల మెట్టయ్య, భాగ్యలక్ష్మి దుర్గాప్రసాద్, చందు తదితరులు పాల్గొన్నారు.

వారంలో రెండు గంటలు శ్రమదానం

-మున్సిపల్ చైర్మెన్ ఆకుల రజిత వెక్కన్న

నవతెలంగాణ-హుస్నాబాద్‌రూరల్



హుస్నాబాద్ పట్టణాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దడానికి ప్రతి ఒక్కరు తమ వంతుగా వారంలో రెండు గంటలు శ్రమదానం చేయాలని హుస్నాబాద్ మున్సిపల్ చైర్మెన్ ఆకుల రజిత వెక్కన్న కోరారు. శనివారం పట్టణంలోని నేతాజీ నగర్‌లో పట్టణ ప్రకృతి వనంలో(మున్సిపల్ ఓపెన్ లాండ్) స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ చేశారు. మున్సిపల్ సిబ్బందితో కలిసి ప్రకృతి వనంలో ఉన్న గడ్డిని తొలగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణ ప్రజలందరూ ఇంటి చుట్టుపక్కల ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పట్టణాన్ని స్వచ్ఛతలో ముందు ఉంచాలని, పర్యావరణ పరిరక్షణ కోసం హుస్నాబాద్ పట్టణ ప్రజలు ప్రతీ కార్యక్రమంలో భాగస్వామమై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మెన్ అనిత రెడ్డి, కౌన్సిలర్ నలిని దేవి, శానిటరీ ఇన్స్పెక్టర్ బాల ఎల్లం, పర్యావరణ అధికారి రవికుమార్, డాక్టర్ రవి, జవాన్ లు సారయ్య, ప్రభాకర్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ కార్డులు ఇచ్చాకే ఇందిరమ్మ ఇండ్లు

-సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు గడిపె మల్లేశ్

నవతెలంగాణ-హుస్నాబాద్‌రూరల్



రాష్ట్రంలో నిరుపేదలకు రేషన్ కార్డులు మంజూరు చేశాకే ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు గడిపె మల్లేష్ శనివారం ఒక ప్రకటనలు కోరారు. రాష్ట్ర ప్రభుత్వం దీపావళి కానుకగా ఇందిరమ్మ ఇండ్లను మంజూరి చేస్తామని అంటునే మరో మాట రాష్ట్ర ప్రభుత్వం రేషన్ కార్డులు వుంటేనే ఇందిరమ్మ ఇండ్ల మంజూరి చేస్తామనడం ఏంటని ప్రశ్నించారు. అర్హులైన పేదలకు రేషన్ కార్డులు ఇచ్చిన తర్వాతనే ఇందిరమ్మ ఇండ్లు మంజూరి చేయాలనే పునరాలోచన సీఎం రేవంత్ రెడ్డి చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై రాష్ట్ర వ్యాప్తంగా నిరసన వెల్లువెత్తడం కాయమని అన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-కొమురవెల్లి



కొమురవెల్లి మండలంలోనీ రసులాబాద్ గ్రామానికి చెందిన ఏర్పుల కిష్టయ్య గత కొద్ది రోజుల క్రితం అనారోగ్యంతో మరణించగా అతని కుటుంబానికి బీఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మెన్ బొంగు రాజేందర్ రెడ్డి ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో రసులబాద్ మాజీ సర్పంచ్ పచ్చిమడ్ల స్వామి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

నవతెలంగాణ-కొండపాక



కుకునూరుపల్లి మండల కేంద్రంలోని పెద్దమ్మ దేవాలయం ఆవరణలో సీసీ రోడ్డు పను టలను డీసీసీ అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే తూముకుంట నర్సారెడ్డి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన కోసం ప్రభుత్వ కృషి చేస్తుందన్నారు. స్థానిక నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మధ్యాహ్న భోజన ప్లేట్స్ పంపిణీ

నవతెలంగాణ-కొండపాక



క్రియేటివ్ టీచర్స్ అసోసియేషన్, ఎస్‌టీయూ కొండపాక మండల శాఖ సంయుక్త ఆధ్వర్యం లో కొండపాక మండలం లోని సిరిసినగండ్ల ఉన్నత పాఠశాలలో తాళ్ళలక్ష్మి జ్ఞాపకార్థం వారి కుమారుడు తాళ్ళ శ్రీనివాస్ 6వ తరగతిలోని 40 మంది విద్యార్థులకు మధ్యాహ్న బోజన ప్లేట్లను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు పెద్ది విఠల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు లింగ శ్రీనివాస్‌లు మాట్లడుతూ ప్రభుత్వ పాఠశాలలో పేద విద్యార్థులు చదువు తారనే ఉద్దేశంతో ఇక్కడ ప్లేట్స్ పంపిణీ చేశమని, విద్యార్థులు ఇష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని తెలిపారు. దాత శ్రీనివాస్‌కి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు దయానంద్, సరస్వతీ పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ

నవతెలంగాణ-బెజ్జంకి



మండల పరిధిలోని చీలా పూర్, పోతారం గ్రామాలకు చెంది న పరకాల పోచయ్య, పుట్ట నర్సయ్య ఇటీవల మృతి చెందారు. శనివారం మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. మండల బీఆర్ఎస్ నాయకులు, మాజీ సర్పంచ్ రావుల మొండయ్య పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-మర్కుక్



మండలంలోని పాములపర్తి గ్రామానికి చెందిన పెద్ద బోయిని కరుణాకర్ (38) అనారోగ్యంతో శనివారం తెల్లవారుజామున మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న మాజీ సర్పంచ్ తిర్మల్ రెడ్డి యువసేన ఆధర్వంలో మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి, ఆర్థిక సాయం అందచేశారు. ఈ కార్యక్రమంలోం మాజీ ఉపసర్పంచ్ పద్మ నర్సింలు, నాయకులు క్రాంతికుమార్, లక్ష్మణ్, కమలాకర్ నాగరాజు, తదితరులున్నారు.

డైట్, కాస్మోటిక్ చార్జీల పెంపు పట్ల హర్షం

నవతెలంగాణ-కొండపాక



గురుకుల పాఠశాల, కళాశాలలో చదువుతున్న విద్యార్థుల కోసం రాష్ట్ర ప్రభుత్వం డైట్, కాస్మోటిక్ చార్జీలు పెంచడం పట్ల కొండపాక గురుకుల పాఠశాల విద్యార్థులు హర్షం వెల్లిబుచ్చారు. ఈ సందర్భంగా శనివారం కేక్ కట్ చేసి సంతోషం వ్యక్తం చేసి సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ శివప్రసాద్ సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

గుణాత్మక విద్యను అందించాలి

నవతెలంగాణ-కొండపాక



విద్యార్థులకు గుణాత్మక విద్యను అందించి ఉత్తములుగా తీర్చిదిద్దాలని కుకునూరుపల్లి మండల విద్యాధికారి బి.సత్తయ్య అన్నారు. మండలంలోని బొబ్బాయిపల్లి, కొలోని వంపు పాఠశాలలను శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల నైపుణ్యాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. అన్ని అంశాల్లో సులభంగా అర్థమయ్యే రీతిలో బోధన సాగాలని ఉపాధ్యాయులకు సూచించారు. వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ కనపరచాలన్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

-డీసీసీబీ చైర్మెన్ చిట్టి దేవేందర్ రెడ్డి

నవతెలంగాణ-కొండపాక



గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని డీసీసీబీ చైర్మెన్ చిట్టి దేవేందర్ రెడ్డి అన్నారు. కొండపాక మండలంలోని కొండపాక, దమ్మకపల్లి, వెలికట్ట తదితర గ్రామాల్లో శనివారం పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం రైతుల కోసం గిట్టుబాటు ధర అందిస్తుందని, శుద్ధి చేసిన ధాన్యాన్ని కేంద్రాలకు తరలించాలని సూచించారు. నాయకులు కనక రాములు, లింగారావు, సురేందర్‌రావు, పాల్గొన్నారు.

వైద్యులు అందుబాటులో ఉండాలి

నవతెలంగాణ-కొండపాక



ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో డాక్టర్లు అందుబాటులో ఉండడంతో పాటు సిబ్బంది సమయపాలన పాటించాలని జిల్లా వైద్యాధికారి పల్వాన్ కుమార్ అన్నారు. కుకునూర్ పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది సమయపాలన పాటించాలని రోగులకు అవసరమైన మెరుగైన వైద్య సేవలు అందించాలని ఓపి వైద్య సేవలు, సాధారణ డెలివరీలు పెంచాలని సూచించారు. వైద్యులు అందుబాటులో లేనిచో కఠిన చర్యలు తప్పవన్నారు. అనంతరము రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్ ఆనంద్, డాక్టర్ నారాయణరావు, డాక్టర్ శ్రీకళ, డిప్యూటీ డిఎంహెచ్వో డాక్టర్ శ్రీనివాస్, గజ్వేల్ డాక్టర్ రేవతి అధికారులు ఉన్నారు.

ఒకే దేశం ఒకే ఎన్నిక రాజ్యాంగ విరుద్ధం

- కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలి
- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాళ్ల బండి శశిధర్



నవతెలంగాణ-గజ్వేల్

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఒకే దేశం ఒకే ఎన్నిక అంటూ మాట్లాడుతున్నదని అది రాజ్యాంగ విరుద్ధమైనదని ప్రజాస్వామ్యం ధ్వంసం చేసే విధంగా ఉందని దేశంలోని లౌకిక సమైక్య వ్యవస్థకు వ్యతిరేకమని సీపీఐ(ఎం) పార్టీ సిద్దిపేట జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాళ్ల బండి శశిధర్ అన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు గజ్వేల్ మండల ఆరవ మహాసభలు పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. మహాసభలు ప్రారంభానికి ముందు పార్టీ పతాకాన్ని ఆవిష్కరించి సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మహాసభలకు ముఖ్యఅతిథిగా ఆయన హాజరై మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతుందన్నారు. అంతర్జాతీయంగా చమురు ధరలు తగ్గిన దేశంలో పెట్రోల్, డీజిల్ పై పన్నులు సేస్ విధిస్తూ నిత్యవసర సరుకులు ధరలు పెరగడానికి కారణం అవుతుందన్నారు. రైతాంగం కార్మిక వ్యతిరేక చర్యలకు పాల్పడుతుందని పేద మధ్యతరగతి ప్రజలపై భారం మోపుతుందని అన్నారు. మత విద్వేష ప్రకటనలు చేస్తూ ప్రజల మధ్య విద్వేషాలకు పాల్పడుతుందని అన్నారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని అన్నారు. రైతు రుణమాఫీ పూర్తిగా అమలు చేయలేదని రైతు భరోసా ముందుకు నడవడం లేదని అన్నారు. డబల్ బెడ్ రూమ్ ఇండ్లు, మహాలక్ష్మి పథకం, వృద్ధులు, వితంతువులకు, వికలాంగులకు పెన్షన్లు జాడేలేదని అన్నారు. గజ్వేల్ నియోజకవర్గం లోని కొండపోచమ్మ మల్లన్న సాగర్ ముంపు గ్రామాల ప్రజల సమస్యలు పరిష్కరించాలని ప్యాకేజీలు ఇండ్ల స్థలాలు రిజిస్ట్రేషన్ చేయాలని అన్నారు. అనంతరం నూతన మండల కమిటీని ఎన్నుకోవడం జరిగింది. కమిటీ కార్యదర్శిగా సందిటి రంగారెడ్డి ఏకగ్రీవంగా ఏకగ్రీవంగా ఎన్నుకోన్నారు. సభ్యులుగా బండ్ల స్వామి, సధాకర్, వెంకట చారి, అయిలయ్య , ఎండి హమ్మద్, స్వామి మహాలక్ష్మి ,రాణిలను ఎన్నుకోన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సందబోయిన ఎల్లయ్య, నాయకులు వేణుగోపాల్, యాదగిరి, నర్సింలు, తదితరులు పాల్గొన్నారు.

పైరవీలు, దోచుకోవడం, దాచుకోవడమే కాంగ్రెసోళ్ళ పని

-రైతుల బాధ రేవంత్ కు పట్టదు

- ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి

నవతెలంగాణ-దుబ్బాక

"సీఎం రేవంత్ రెడ్డి సర్కారు అన్ని రంగాల్లో అట్టర్ ఫ్లాప్ అయ్యింది. ఇచ్చిన హామీలు విస్మరించి కేసీఆర్ ను తిట్టడమే పనిగా పెట్టుకున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెసోళ్ల పనితీరు పైరవీలు, దోచుకోవడం, దాచుకోవడం అన్నట్లుగా ఉంది. గత వారం పది రోజులుగా వర్షాలతో ధాన్యం తడిసి కొట్టుకుపోతుంది. కొనుగోలు కేంద్రాలు ఆర్భాటంగా ప్రారంభించి నేటికీ ఒక్క గింజ ధాన్యం సేకరణ చేయలేదు. సీఎం రేవంత్ సర్కార్‌కు రైతుల బాధలు పట్టవు" అని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి ఘాటుగా విమర్శించారు. తక్షణమే మార్కెట్లోకి తీసుకొచ్చిన ధాన్యాన్ని ఎలాం టి షరతుల్లేకుండా తీసుకోవాలని డిమాండ్ చేశారు. శనివారం దుబ్బాక పట్టణ కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్ కమిటీని ఎమ్మెల్యే ప్రభాకర్ రెడ్డి పరిశీలించారు. అకాల వర్షా లతో తడిసిన ధాన్యాన్ని పరిశీలించి రైతులకు అండగా తాను ఉంటానని భరోసా ఇచ్చారు. కలెక్టర్ మను చౌదరితో ఫోన్లో మాట్లాడి వెంటనే ధాన్యం సేకరించాలని దుబ్బాక వచ్చి ఇక్కడి రైతుల కష్టాలను తీర్చాలని కోరారు. అనంతరం 12వ వార్డు కౌన్సిలర్ బట్టు యాదమ్మ ఎల్లం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట మున్సిపల్ కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలున్నారు.



ప్రజా సమస్యలే ఎజెండగా పోరాటం చేస్తాం

- సీపీఐ(ఎం) మండల కార్యదర్శిగా ఎన్నికైన సందిటి రంగారెడ్డి



నవతెలంగాణ-గజ్వేల్

ప్రజా సమస్యలే ఎజెండగా సీపీఐ (ఎం) నిరంతరంగా పోరాటం చేస్తుందని గజ్వేల్ మండల కార్యదర్శిగా ఎన్నికైన సందిటి రంగారెడ్డి అన్నారు. శనివారం నిర్వహించిన సీపీఐ(ఎం) ఆరవ మహాసభలో ఆయనను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గజ్వేల్ మండలంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించే వరకు పోరాటం సాగిస్తామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై నిరంతరంగా పోరాటం తలపెడతా ఓమన్నారు. వ్యవసా య కూలీలను కార్మిక వర్గాలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించు కోవడం లేదన్నారు. కార్మిక కర్షకులపై పోరాటం సాగిస్తామని ఆయన అన్నారు. గ్రామపంచాయతీల తీర్మానం ఉంటేనే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు మంజూరు చేస్తాయని చెప్పారు.

పౌష్టికాహారం కొరకు గోకులాశ్రమం రావడం అభినందనీయం

- జిల్లా విద్యాశాఖాధికారి శ్రీనివాస్ రెడ్డి



నవతెలంగాణ-నంగునూరు

ప్రభుత్వ బడుల్లోని పేద విద్యార్థులకు పౌష్టికాహారం అందించేందుకు గోకులాశ్రమం నిర్వాహకులు ముందుకు రావడం అభినందనీయమని జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్లంకి శ్రీనివాసరెడ్డి అన్నారు. శనివారం సిద్దిపేట అర్బన్ మండలం వెలకటూరులోని గోకులాశ్రమంలో నంగునూరు మండలంలోని మగ్దుంపూర్, ప్రాథమిక, ఉన్నత పాఠశాలలతో పాటు ముంద్రాయిలోని ప్రాథమికోన్నత పాఠశాల, సిద్దిపేట అర్బన్ మండలంలోని వెల్కటూరు ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు, బక్రి చెప్యాల ఉన్నత పాఠశాలల విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. గోకులాశ్రమం వ్యవస్థాపకులు మధుసూదన రావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థులకు బలవర్ధకమైన పౌష్టికాహారాన్ని అందించాలని సంకల్పంతో గోకులాశ్రమం నిర్వాహకులు చేపట్టిన ఈ కార్యక్రమాన్ని తన చేతుల మీదుగా ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. మంచి ఉద్దేశంతో ప్రారంభిస్తున్న ఈ కార్యక్రమానికి జిల్లా విద్యాశాఖ తరఫున అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామన్నారు. మగ్దుంపూర్, వెల్కటూర్ పాఠశాలల విద్యార్థులకు బోధన అభ్యసన సామాగ్రి, నోటు పుస్తకాలు, దుస్తులు అందించి ఇప్పటికే విద్యారంగానికి గోకులాశ్రమం అనేక విధాల సహకారం అందిస్తోందని తెలిపారు. గోగులాశ్రమం నిర్వాహకులు సరళా మాత మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివే చాలామంది పేద విద్యార్థులకు సరైన పౌష్టికాహారం అందక మానసికంగా, శారీరకంగా బలహీనంగా ఉంటున్నారని చెప్పారు. దీనిని దృష్టిలో ఉంచుకొని ముందుగా గోకులాశ్రమంలు ఉన్న వెల్కటూర్, సిద్ధాశ్రమం ఉన్న మగ్దుంపూర్‌లోని ప్రాథమిక పాఠశాలతో పాటు, ముంద్రాయి ప్రాథమికోన్నత పాఠశాల, బక్రి చెప్యాల ఉన్నత పాఠశాల విద్యార్థులకు పౌష్టికాహారం వారంలో రెండు రోజులపాటు అందివ్వాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారులు తగిరెడ్డి దేశి రెడ్డి, రాజ ప్రభాకర్ రెడ్డి, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు దాసరి సుధాకర్, ముంద్రాతి రమేశ్, దారం నాగేందర్ రెడ్డి, విజయ్ కుమార్, ప్రధానోపాధ్యాయులు ప్రశాంతి, పాకాల రాజయ్య, బండారి ప్రసాద్ రెడ్డి, ఆశ్రమ ప్రతినిధులు శ్రీరామ్ కుమార్, వెంకట్, జితేందర్ తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులు నష్టపోకుండా కుల గణన చేపట్టాలి

నవతెలంగాణ-సిద్దిపేట



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కుల గణన సర్వేను విజయవంతం చేసి ప్రభుత్వానికి సహకరిస్తామని, మూడు వారాల పాటు మధ్యాహ్నం నుంచి ప్రాథమిక పాఠశాలలు మూసివేసి కేవలం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులను మాత్రమే గణనకు కేటాయించడం వల్ల ప్రాథమిక స్థాయిలో విద్యావ్యవస్థకు తీవ్ర నష్టం జరుగుతుందని పీఆర్టీయూ టీఎస్ సిద్దిపేట జిల్లా శాఖ అధ్యక్షులు మల్లు గారి ఇంద్రసేనారెడ్డి, ప్రధాన కార్యదర్శి ఆదరాశి పల్లి శశిధర్ అన్నారు. శనివారం వారు మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థులకు నష్టం జరగకూడదని ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులను గణనకు కేటాయించ లేదని, మూడు వారాలపాటు ప్రాథమిక పాఠశాలలు ఒంటిపూట నడిస్తే తల్లిదండ్రులకు తప్పుడు సంకేతాలు వెళ్ళుతాయన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని ఉన్నత, ప్రాథమిక అందరు ఉపాధ్యాయులను వినియోగించుకొని నాలుగైదు రోజుల్లో సర్వే పూర్తి చేస్తే విద్యార్థులకు, విద్యావ్యవస్థకు నష్టం జరగకుండా ఉంటుందని తెలిపారు. విద్యా హక్కు చట్టం ప్రకారం ఉపాధ్యాయులను ఎన్నికల విధులకు తప్ప మరేవిధులకు వినియోగించరాదన్నారు. అయినా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కులగణాలలో పాల్గొనడానికి ఉపాధ్యాయులమంతా సిద్ధంగా ఉన్నామని, కానీ విద్యార్థులకు నష్టం కలగకుండా సర్వే ఏర్పాట్లు చేయాలని కోరారు. ప్రస్తుతం ఒక ఎన్యుమరేటర్‌కు 150 నుంచి 170 వరకు ఇల్లు కేటా యిస్తున్నారని, అలాకాకుండా రెండవ శనివారం, ఆదివారం, సోమ, మంగళవారాలు నాలుగు రోజులపాటు వరసగా కేటాయిస్తే అందులో రెండు రోజులు సెలవులు ఉంటాయనీ, రెండు రోజులు పనిదినాలను మాత్రమే కోల్పోయి సర్వే విజయవంతంగా పూర్తి అవుతుందని అన్నారు.

మరో మోసానికి మళ్ళీ డ్రామా



నవతెలంగాణ-గజ్వేల్ రూరల్

తెలంగాణ ప్రజలను మరో మారు మోసం చేసేందుకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మళ్ళీ డ్రామాలు మొదలు పెట్టారని కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు ఊడేం సారిక శ్రీనివాసరెడ్డి వ్యాఖ్యానించారు. శనివారం గజ్వేల్ మున్సిపల్ పరిధిలోని ప్రజ్ఞాపూర్‌లో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రమంతా పాదయాత్ర చేస్తారని ఆయన చెబుతుంటే దేనికో అర్థం కావడం లేదన్నారు. హరీశ్‌రావును ప్రతిపక్ష నేతగా చేయాలనుకుంటున్నా కేసిఆర్ దగ్గర మార్కులు కొట్టేయడానికి పాదయాత్ర చేస్తారా అని ఎద్దేవాచేశారు. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో నిరుద్యోగులు మహిళలకు పెద్దపీట వేస్తున్నారని చాటింపు వేయడానికి పాదయాత్ర చేస్తారా? కేటీఆర్ సమాధానం చెప్పాలని వారు డిమాండ్ చేశారు. పాదయాత్ర మాట అటు ఉంచి, ముందు కేసీఆర్ ఫామ్ హౌస్ నుంచి బయటకు రావా, వెంటనే రావాలన్నారు. కేటీఆర్‌కు పాదయాత్ర చేసే నైతిక అర్హత లేదని స్థానిక సంస్థల ఎన్నికలలో బీఆర్ఎస్‌కి డిపాజిట్ దక్కదన్నారు. పదేళ్ల అధికారంలో ఉండి గజ్వేల్ నియోజకవర్గంలో నిరుద్యో గులకు ఉద్యోగ అవకాశాలు కల్పించారా సమాధానం చెప్పాల న్నారు. దళితులకు మూడెకరాల భూమి పంపిణీ చేశారా? అని వారు ప్రశ్నించారు. అభివృద్ధి పనులలో అవినీతికి పాల్పడితే జైలుకు పంపిస్తా అన్న కేసీఆర్ ఆయన హయాంలో గజ్వేల్ లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం పనులలో జరిగిన అవినీతిలో ఎంతమందిని జైలుకు పంపించారో చెప్పాలన్నారు. అధికారం కోల్పోయాక అసహనంతో బిఆర్ఎస్ నేతలు మాట్లాడుతున్నారని ఘాటుగా విమర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, పాల్గొన్నారు.

పోరాటాల ఫలితమే డైట్, కాస్మోటిస్ చార్జిల పెంపు

- డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్



నవతెలంగాణ-గజ్వేల్

డీబీఎఫ్, దళిత, బీసీ, విద్యార్థి సంఘాల పోరాటం ప్రయత్నాలతో హాస్టళ్లు, గురుకులాలు, ఇతర విద్యా సంస్థల్లోని విద్యార్థినీ, విద్యార్థులకు డైట్ కాస్మోటిస్ చార్జీలు పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వానికి డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి శంకర్ కృతజ్ఞతలు తెలిపారు. శనివారం గజ్వేల్‌లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం డైట్,మెస్ చార్జీలు పెంచకుండా కాలయాపన చెసి విద్యార్థులకు అన్యాయం చెసిందన్నారు. డైట్ చార్జీలు బాలికలకు, బాలురకు 3 నుంచి 7వ తరగతి విద్యార్థినీ విద్యార్థులకు రూ.950 నుంచి రూ.1330కు, 8 నుంచి 10వరకు రూ.1100 నుంచి రూ.1540కు, ఇంటర్ నుంచి పీజీ వరకు రూ.1500 నుంచి రూ. 2100కు పెంచారని వివరించారు. కాస్మోటిక్ చార్జీలు బాలికలకు 3 నుంచి 7వరకు రూ.55 నుంచి రూ.175కు, 8 నుంచి 10వరకు రూ.75నుంచి రూ.275లకు పెంచినట్లు అన్నారు. బాలురకు 3 నుంచి 7వరకు రూ.62 నుంచి 150కు ,8 నుంచి 10వరకు రూ.62 నుంచి రూ.200కు పెంచుతూ 10 రోజుల్లో అమలులోకి వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు రాచకొండ వెంకటేశం, డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండ స్వామి, జర్నలిస్ట్ పుట్ట రాజు, జామాత్ ఇస్లామిక్ ఆర్గనైజర్ కాశీం, డీబీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బ్యాగరి వేణు, తూర్పు యాదగిరి, రాచకొండ రవి, జెగ్గ కిషన్, సత్యనారయణ, మంద స్వామి పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో నేరాలు నియంత్రించవచ్చు

నవతెలంగాణ- రాయపోల్

గ్రామాల్లో, దేవాలయాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం ద్వారా నేరాలు నియంత్రించవచ్చని, నిందితులను త్వరగా పట్టుకునే అవకాశం ఉంటుందని తొగుట సీఐ షేక్ లతీఫ్ అన్నారు. శనివారం మండలం అనాజీపూర్ గ్రామంలో రేణుకా మాత ఎల్లమ్మ ఆలయంలో సీసీ కెమెరాల ఎను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతకొద్ది రోజుల నుంచి సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా పలు దేవాలయాలలో దొంగతనాలు జరుగుతున్నాయని, ఆ దేవాలయాల్లో, గ్రామాల్లో సీసీ కెమెరాలు లేకపోవడంతో నిందితులను పట్టుకోవడం కష్టమవుతుందన్నారు. గ్రామాల్లో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రాయపోల్ ఎస్సై రఘుపతి సీసీ కెమెరాల యొక్క ప్రాధాన్యత, నేరాల నియంత్రణ గురించి అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా అనాజీపూర్ గౌడ సంఘం వారు ముందుకు వచ్చి ఎల్లమ్మ దేవాలయంలో ఆరు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం అభినంద నీయమన్నారు. మండల వ్యాప్తంగా అన్ని గ్రామాలలో ప్రధాన కూడలిలలో, ఆలయాలలో తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రాయపోల్ ఎస్సై విక్కుర్తి రఘుపతి, అనాజీపూర్ గౌడ సంఘం అధ్యక్షులు రాయపోల్ హరికృష్ణ గౌడ్, ఉపాధ్యక్షులు అన్నేబోయిన నర్సింలు గౌడ్, డైరెక్టర్లు యాదగిరి గౌడ్, బాల్ రాజు గౌడ్, శ్రీనివాస్ గౌడ్, సంఘ సభ్యులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



అందుబాటులో అద్దెకు ఆర్టీసీ బస్సులు

నవతెలంగాణ-గజ్వేల్‌రూరల్



ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితమని, గమ్యాలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేరుకోవచ్చని, కార్తిక మాసం పురస్కరించుకొని విహారయాత్రలు, వివాహాది శుభకార్యాలకు అద్దె ప్రాతిపదికన ఆర్టీసీ బస్సులను నడపనున్నట్లు గజ్వేల్ ప్రజ్ఞాపూర్ ఆర్టీసీ డిపో మేనేజర్ పవన్ అన్నారు. శనివారం ప్రజ్ఞాపూర్ ఆర్టీసీ డిపో కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రయివేటు వాహనాల్లో ప్రయాణం సురక్షితం కాదని సూచించారు. ఆర్టీసీ బస్సుల్లో ఎంతో అనుభవం కలిగిన డ్రైవర్లు తరచు వాహనాలను ఎలాంటి ప్రమాదాల గురి కాకుండా తిప్పుతారన్నారు. ఎలాంటి సందర్భంలోనైనా ప్రయివేట్ వాహనాలను కాకుండా ఆర్టీసీ బస్సులను అద్దెకు తీసుకువెళ్లచ్చని కోరారు. అందరికీ అనుగుణంగా సరసమైన ధరలకు సంస్థ నిర్ణయించిన రేట్లకే బస్సులను అద్దెకివ్వడం జరుగుతుందన్నారు. డిపో పరిధిలోని ప్రయాణికులు ఈ సదా అవకాశాన్ని ఉపయోగించుకోవాలని ఆశాభావం వ్యక్తం చేశారు. మరింత సమాచారం కోసం 9959226270, 7386367677, 9948866980 నంబర్లలో సంప్రదించాలన్నారు. ఈ కార్యక్ర మంలో డిపో సిబ్బంది, కార్మికులు, పాల్గొన్నారు.

సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలి

నవతెలంగాణ-గజ్వేల్



గజ్వేల్ నియోజకవర్గం ఉన్న సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాలను వెంటనే ఏర్పాటు చేయాలని బీఆర్ఎస్ గజ్వేల్ ఇన్చార్జి వంటేరు ప్రతాప్ రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ తో పాటు మండలంలో పలు గ్రామాల్లో పత్తి పంటలను ఆయన పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు గజ్వేల్ నియోజకవర్గం లో సీసీఐ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయక పోవడం శోచనీయమన్నారు. సీసీఐ కొనుగోలు కేంద్రాల వద్ద పత్తి క్వింటాలుకు 7500 రూపాయలు చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడంతో మార్కెట్లో దళారులు రైతులకు నడ్డి విరుస్తున్నారని ధరలు తగ్గించి పత్తిని కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వం కళ్లు తెరిచి దళారీ వ్యవస్థను అరికట్టాలని ఇప్పటికైనా దళారులు క్వింటాలుకు ప్రభుత్వం ఇచ్చే రేటు కంటే తక్కువ కొనుగోలు చేస్తే దళారులపై యాక్షన్ తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ మాజీ జెడ్పీటీసీ బొల్లారం ఎల్లయ్య రమేష్ రైతులు తదితరులున్నారు.

బలసదనము సందర్శించిన డిస్ట్రిక్ట్ లీగల్ అధికారి

నవతెలంగాణ- సిద్దిపేట



తెలంగాణ రాష్ట్ర న్యాయసేవాధికాం సంస్థ, జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్ పర్సన్ కె. సాయి రమాదేవి అదేశాల మేరకు శనివారం బలసదనమును డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అధారిటీ సెక్రటరీ స్వాతి రెడ్డి సందర్శించారు. మొదట పిల్లలతో మాట్లాడి వారి భాగోగులు తెలుసుకోన్నారు. తర్వాత పిల్లలు వారి స్వీయ పరిచయం చేసుకొని పాటలు పాడినారు. వారికి చట్టాల గురుంచి, చదువు విలువ గురుంచి తెలిపారు. తరగతి గదులని, పరిసారాలను, కళాశాల సిబ్బంది విధులకి సరిగ్గా హాజరు అవవుతున్నర లేదా అని రిజిస్టర్‌ని పరిశీలించారు. బలసదనము లో భోజన నాణ్యత, వంటగది పరిసారాలు, నిల్వ ఉన్న ఆహార పదార్థాలని పరిశీలించారు. బాత్ రూమ్స్, మరుగు దొడ్లు పరిశుభ్రంగా ఉన్నాయా లేవా అని పరిశీలించారు. స్టోర్ రూమ్‌లో ఉన్న కొత్త బెడ్స్, చైర్స్, దిండులు ఇతరా ఆట వస్తువులు తీసి వాడుకోవాలని, అవి అలాగే ఉంటె పాడవుతాయని అని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డెన్ కే. రాజిత, పి. భాగ్య, ఏం. వరలక్ష్మి, పి. ప్రనిత పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా యోగా సెలెక్షన్స్ రాష్ట్ర పోటీలకు ఎంపిక



నవతెలంగాణ-సిద్దిపేట

జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి సౌందర్య ఆధ్వర్యంలో టీటీసీ భవన్ లో ఉమ్మడి జిల్లా యోగా సెలక్షన్స్ జరిగాయి. ఇందులో అండర్ 14 ,17 బాల బాలికలు సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట వివిధ ప్రాంతాలకు చెందిన దాదాపు 150 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ట్రెడిషనల్ యోగ, ఆర్టిస్ట యోగ, రిథమిక్ యోగలను నిర్వహించి, ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతిరోజు క్రమం తప్పకుండా సాధన చేయవలెననీ, యోగాలో అద్భుతమైన ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయిలో మన జిల్లాకు పతకాలు తీసుకురావాలనీ, గతంలో చాలా సార్లు మన జిల్లా ఉత్తమ ప్రతిభ కనబరిచింది అదే ఆనవాయితీని కొనసాగించాలని సూచించారు. అండర్ 17 బాల, బాలికలకు నవంబర్ 8 నుంచి 10 వరకు వరంగల్ జిల్లాలో రాష్ట్రస్థాయి యోగా పోటీలు జరగనున్నాయనీ, అండర్ 14 బాల, బాలికలకు కామారెడ్డి జిల్లా నందు త్వరలో జరగనున్నాయనీ తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు తోట సతీష్, రాధిక ,రజిని, కవిత, మధుసూదన్, బిక్షపతి లక్ష్మీనారాయణ, వెంకట స్వామి, శ్యామ్, పద్మ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన సదస్సు



నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, ప్రభుత్వ పాలనా శాస్త్ర విభాగం, స్థానిక రెవెన్యూ శాఖ సంయుక్తంగా కళాశాలలో విద్యార్థులకు స్వీప్ పై అవగాహన సదస్సును నిర్వహించారు. శనివారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కమలా క్రిస్టియన్ మాట్లాడారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నూతన ఓటర్లకు ఓటు నమోదు కార్యక్రమం ఓటు యొక్క ప్రాధాన్యతపై సదస్సును నిర్వహించామన్నారు. విద్యార్థులే రేపటి సమాజ నిర్మాతలు వారి ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు. నిజమైన ప్రజాస్వామ్య సాధనకు 100శాతం ఓటింగ్ టర్న్ అవుట్ జరగాలని కార్యక్రమ నిర్వాహకుడు డాక్టర్ బి మురళీధర్ విద్యార్థులను కోరారు. ఓటు హక్కు చరిత్ర దాని ప్రాధాన్యతపై మండల ఉప తాహసిల్దార్ భాస్కర్ ప్రసంగించారు. ఓటు హక్కు సద్వినియోగం ప్రజల భవిష్యత్తు, సంక్షేమం ఆధారపడి ఉంటుందని, దానికి 18 ఏండ్లు నిండిన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోవాలని పలువురు వక్తలు విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు డాక్టర్ జయరాజు, డాక్టర్ వేణు, ఇతర అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, పెద్ద సంఖ్యలో విద్యార్థినులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి కలిసి కృతజ్ఞతలు తెలిపిన నూతన వైస్ ఛాన్సర్



నవతెలంగాణ-ములుగు

ములుగు మండల కేంద్రంలో కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం నూతన వైస్ ఛాన్సలర్‌గా నియమితులైన డాక్టర్ దండ రాజిరెడ్డి శనివారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో ఉద్యాన రంగ అభివృద్ధికి కృషి చేస్తామని ఈ సందర్భంగా వైస్ ఛాన్సర్ పేర్కొన్నా రు

నెట్ బాల్‌కు విద్యార్థుల ఎంపిక



నవతెలంగాణ-గజ్వేల్

ఉమ్మడి మెదక్ జిల్లాలో నెట్ బాల్ క్రీడలకు విద్యార్థిని విద్యార్థులు ఎంపికైనట్లు సిద్దిపేట జిల్లా ఎస్జీఎఫ్ సెక్రటరీ సమ్మయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్‌జీఎఫ్ అండర్ 19, 17,14 విద్యార్థిని విద్యార్థులు ఎంపికలు గజ్వేల్ మున్సిపల్ పరిధిలోని ప్రజ్ఞాపూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు అయన తెలిపారు. 250 బాలబాలికలు ఎంపిక చేస్తున్నట్లు ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి కృష్ణ, సిద్దిపేట జిల్లా ఎస్జీఎఫ్ సెక్రటరీ సౌందర్య, భవాని, విజయ్ రేఖ, రంజిత్, రవికుమార్, నాగేష్, ప్రశాంత్, ఆంజనేయులు, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో మహిళ మృతి

-పద్మనాభునిపల్లిలో ఘటన


ఫైల్

నవతెలంగాణ-దుబ్బాకరూరల్

అనారోగ్య సమస్యలతో బాధపడుతూ మహిళ మృతి చెందిన సంఘటన దుబ్బాక మండలంలో శనివారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం పద్మనాభునిపల్లి గ్రామానికి చెందిన ఎయ్య రాజవ్వ (47), గత కొన్ని నెలలుగా పలు రకాల అనారోగ్య సమస్యలతో బాధపడుతూ మంచాన పడింది. శుక్రవారం రాత్రి రాజవ్వకు తన వదిన లక్ష్మి భోజనం వడ్డించగా తినలేదు. దీంతో భయపడి విషయాన్ని లక్ష్మి కుటుంబీకులకు చెప్పడంతో వెంటనే ఆటోలో సిద్దిపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షలు చేసి కిడ్నీ, గుండె సంబంధిత వ్యాధులతో మృతి చెందినట్లు నిర్ధారించడంతో కుటుంబీకులు కన్నీరు మున్నీరయ్యారు. రాజవ్వ మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకోగా సాయంత్రం మృతురాలి బంధువులు అంత్యక్రియలు నిర్వహించారు. మరోవైపు ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కొనుగోలు కేంద్రం వద్ద రైతుల నిరసన

నవతెలంగాణ-నంగునూరు

నంగునూరు మండలం రాంపూర్ గ్రామంలో వడ్ల కొనుగోలు కేంద్రం వద్ద శనివారం రైతులు నిరసన వ్యక్తం చేశారు. పదిహేను రోజులు అవుతున్న ఇప్పటి వరకు ఒక గింజ కూడా కొనలేదని ఆవేదన వ్యక్తంచేశారు. దళారులు యదేచ్ఛగా వచ్చి రాంపూర్ గ్రామం నుంచి ఇప్పటికి 15 ట్రాక్టర్లు కొనుగోలు చేశారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను ఈ విధంగా మోసం చేస్తుందని చెప్పారు. గ్రామ రైతులు ఖాత లింగారెడ్డి, దేవర ఎల్లయ్య, రేగులపల్లి మల్లారెడ్డి, ఎం.డి. గఫూర్, ఆరుట్ల సూర్యకాంతరెడ్డి, తాళ్లపల్లి మహేశ్, గుడిపల్లి నర్సింహులు, వస్పరి లక్ష్మయ్య, మోటం లక్ష్మయ్యలు పాల్గొనగా బీఆర్ఎస్ నాయకులు మద్దతు పలికారు.

అక్రమ ఇసుక తరలించిన ట్రాక్టర్ల పట్టివేత




నవతెలంగాణ-కోహెడ

మండలంలోని తంగళ్ళపల్లి గ్రామ సమీపంలోని మోయతుమ్మెదవాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్‌లను శనివారం ఎస్సై అభిలాష్ పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తంగళ్ళపల్లి గ్రామానికి వెళ్తున్న క్రమంలో ఎదురుగా వస్తున్న ట్రాక్టర్‌లు టీఎస్ 36 7156, టీఎస్ 36 2374 ఇసుకలోడ్‌తో ఎలాంటి అనుమతులు లేకుండా తరలించడం జరిగింది. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ధర్మారం వద్ద రోడ్డు ప్రమాదం



నవతెలంగాణ-మిరుదొడ్డి

ప్రమాదవశత్తు ఆటో బోల్తా పడి పలువురికి తీవ్ర గాయాలైన సంఘటన మీరుదొడ్డి మండలం ధర్మారం గ్రామంలో చోటుచేసుకుంది. దుబ్బాక మండలం హబ్సీపూర్ గ్రామానికి చెందిన గొట్టం రాజు (30), అప్పనపల్లికి చెందిన విజయ్ కుమార్ (20) సిద్దిపేట వైపు నుంచి హబ్సీపూర్ వైపు ఆటోలో వెళ్తూ ధర్మారం పెట్రోల్ బంక్ వద్ద ఆగి ఉన్న లారీని ఢీకొట్టారు. ఆటో నడిపిస్తున్న గొట్టం రాజు , ఆటో ముందు భాగం నుజ్జయి, హ్యాండిల్ - సీటు మధ్యలో ఇరుక్కుపోగా స్థానికుల సహాయంతో బయటకు తీసి భూంపల్లి అంబులెన్సు సిబ్బంది108 సిబ్బంది నవీన్ పైలట్ మహేష్‌లు ప్రథమ చికిత్స చేసి సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అంబులెన్స్ సిబ్బందిని స్థానికులు అభినందించారు.

బాబు కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-మిరుదొడ్డి

అనారోగ్యంతో మృతి చెందిన బాబు కుటుంబాన్ని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి పరామర్శిం చారు. శనివాంఁము అక్బర్ పేట భూంపల్లి మండల ఖాజీపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు బాబు కుటుంబాన్ని పరమర్శించి అండగా ఉంటానని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు పంజాల శ్రీనివాస్ గౌడ్, ఎంపీటీసీ చిరంజీవి, పరశురాములు, పాల్గొన్నారు.

కుక్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-కోహెడ

మండలంలోని నాగసముద్రాల మోడల్‌స్కూల్ బాలికల వసతి గృహంలో ఖాళీగా ఉన్న హెడ్ కుక్, అసిస్టెంట్ కుక్ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు శనివారం ఇంచార్జీ స్పెషల్ ఆఫీసర్ హిమబిందు ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని మహిళలు నేటి నుంచి 7వ తేదిలోగా పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. హెడ్ కుక్ 10వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని, అసిస్టెంట్ కుక్ పోస్టుకు 7వ తరగతి ఉత్తీర్ణులై, వంట చేయడంలో అనుభవం కలిగిన వారికి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. అర్హులైన మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. .

బాధిత కుటుంబాలకు బీఆర్ఎస్ అండ

నవతెలంగాణ-మిరుదొడ్డి

బాధిత కుటుంబాలకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని మాజీ మండల అధ్యక్షులు లింగాల వెంకట్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ బాల మల్లేశం గౌడ్‌లు అన్నారు. అక్బరుపేట-భూంపల్లి మండల పరిధిలోని వీరారెడ్డిపల్లిలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన మేడిపల్లి స్వామి దాసు కుటుంబాన్ని శనివారం వారు పరామర్శించారు. అనంతరం వారి కుటుంబానికి లింగాల వెంకట్ రెడ్డి 50కిలోలు, బాల మల్లేశంగౌడ్ 25కిలోలు బియ్యాన్ని అందజేశారు.

పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలి

- టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు చిట్యాల విజయేందర్ రెడ్డి



నవతెలంగాణ-సిద్దిపేట

పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలనీ తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్(టీపీటీఎఫ్) జిల్లా అధ్యక్షులు చిట్యాల విజయేందర్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కమిటి సమావేశం ఆయన అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి కనకయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పోనమల్ల రాములు, సీనియర్ నాయకులు తిరుపతి రెడ్డిలు మాట్లాడుతూ పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని, నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలనీ, పీఆర్‌సీని వెంటనే అమలు చేయాలనీ, ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులకు ఎమ్మెల్సీ ఓటు హక్కు కల్పించాలనీ కోరారు. కుల గణన విధులను కేవలం ప్రభుత్వ, స్థానిక సంస్థల, ఎయిడెడ్ ప్రాథమిక, పాఠశాలల ఉపాధ్యాయులకు మాత్రమే కేటాయించడాన్ని ఖండిస్తూ, ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పాఠశాల నిర్వహించి మధ్యాహ్న భోజనం పెట్టించి తరువాత సెన్సెస్ విధులకు హాజరు కావాలని ఉత్తర్వులు ఇచ్చారని, మద్యాహ్నం సర్వేకు వెళ్ళితే గ్రామస్తులు ఎవ్వరు అందుబాటులో ఉండరని తెలిపారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాల్లో అధికంగా ఉన్న ఉపాధ్యాయులను గుర్తించి సర్వే విధులు కేటాయించాలని, ఉదయం పూట సర్వే నిర్వహించి ,పాఠశాలలకు ఆటంకం కలగకుండా నిర్వహించే విధంగా కుల గణన ఉత్తర్వులను సవరించి విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పోనమల్ల రాములు ఉద్యోగ విరమణ అభినందన సభ 3న సిద్దిపేట పట్టణంలోని విపంచి కళా నిలయంలో టీపీటీఎఫ్ సిద్దిపేట జిల్లా శాఖ అధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందని, దానిని విజయవంతం చేయాలనీ కోరారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధానకా ర్యదర్శి సుంచునరేందర్, రాష్ట్రకౌన్సిలర్లు రాజులు, రాజయ్య, తిరుపతి, రామస్వామి, ఉపాధ్యక్షులు నర్సింహా రెడ్డి, పాపిరెడ్డి అజీజ్, ప్రభాకర్, కార్యదర్శులు సత్యనారాయణ, శివాజీ, రాంరెడ్డి, రాములు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కుల గణన విధులు ఉపాధ్యాయులకివ్వటం సరికాదు

నవతెలంగాణ-నంగునూరు

కుల గణన విధులు ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యా యులకే కేటాయించడం సరికాదని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి ఎస్. కనకయ్య అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కుల గణన విధులను కేవలం ప్రభుత్వ, స్థానిక సంస్థల ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు మాత్రమే కేటాయించడాన్ని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ ఖండిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పాఠశాల నిర్వహించి మధ్యాహ్న భోజనం పెట్టించి తరువాత సెన్సెస్ విధులకు హాజరు కావాలని ఉత్తర్వులు ఇచ్చారని, మద్యాహ్నం సర్వేకు వెళ్ళితే గ్రామస్తులు ఎవ్వరు అందుబాటులో ఉండరని తెలిపారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత ఉన్నత పాఠశాలలో అధికంగా ఉన్న ఉపాధ్యాయులను గుర్తించి సర్వే విధులు కేటాయించాలని కోరారు. ఉదయం పూట కొంత ఉపాధ్యా యులు, మధ్యాహ్నం కొంత మంది ఉపాధ్యాయు లను కేటాయించాలని డిమాండ్ చేశారు. ఒక రోజులో సగం మంది ఉపాధ్యాయులు, మరో రోజులో సగం మంది ఉపాధ్యాయులు సర్వే నిర్వహించే విధంగా కుల గణన ఉత్తర్వులను సవరించి విడుదల చేయాలని పేర్కొన్నారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ప్రత్యేక పూజలు



నవతెలంగాణ-నంగునూరు

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తం రెడ్డి శనివారం నంగునూరు మండలం కోనాయి పల్లి వెంకటేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో మరోసారి పోటీ చేసేందుకు సిద్ధమైన రఘోత్తం రెడ్డి వెంకటేశ్వర ఆలయంలో పూజలు నిర్వహించి తన ప్రచారాన్ని అధికారికంగా ప్రారంభిం చారు. గత ఎన్నికలకు ముందు కూడా ఆయన ఈ దేవాలయంలో పూజలు చేసి ప్రచారాన్ని ప్రారంభించారు. ఆ ఎన్నికలో ఆయన పీఆర్టీయూ టీఎస్ అధికారిక అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు. ఈసారి పీఆర్టీయూ టీఎస్ అధికారిగా అభ్యర్థిగా వంగ మహేందర్ రెడ్డిని ప్రకటించింది. దీంతో ఉపాధ్యా యులతో విస్తృత పరిచయాలు కలిగి ఉన్న రఘోత్తం రెడ్డి మరోసారి పోటీ చేసేందుకు సిద్ధమై తన ప్రచారాన్ని ఇప్పటికే అనధికారికంగా ప్రారంభిం చారు. కాగా శనివారం ఉదయం కోనాయి పల్లి వెంకటేశ్వర ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రచారాన్ని అధికారికంగా ప్రారంభించారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి పేదల నిధి

- కాంగ్రెస్ దుబ్బాక నియోజకవర్గ ఇంచార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి



నవతెలంగాణ-రాయపోల్

ముఖ్యమంత్రి సహాయ నిధి పేదల నిధి, అనారోగ్యబారిన పడినవారికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని కాంగ్రెస్ దుబ్బాక నియోజకవర్గ ఇంచార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శనివారం తన స్వగృహంలో సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దౌల్తాబాద్ మండలం మహమ్మద్ షాపూర్ గ్రామానికి చెందిన అబ్బగౌని ఆంజనేయులు గౌడ్ గత కొన్ని రోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతున్నాడు. అతని వైద్యం కోసం రూ. 2.5 లక్షల ఎల్వోసిని అందజేయడం జరిగిందన్నారు. మాది ప్రజా ప్రభుత్వమని నా దృష్టికి తీసుకొని వచ్చిన ఎల్వోసీ కానీ, సీఎంఆర్ఎఫ్ చెక్కులు గాని ఇంచార్జి మంత్రి కొండ సురేఖ సహకారంతో బాధితులకు తక్షణమే అందచేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు గొల్లపల్లి కనకయ్య యాదవ్, దౌల్తాబాద్ మండల అధ్యక్షులు పడాల రాములు, ఉపాధ్యక్షులు మద్దెల స్వామి, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు బండారు లాలు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు చెరుకు విజయ్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కబ్జాకు గురవుతున్న ఆలయ భూములను కాపాడాలి



నవతెలంగాణ-కొమురవెల్లి

కబ్జాకు గురవుతున్న మల్లన్న ఆలయ భూములు కాపాడాలని బీజేపీ మండల అధ్యక్షులు బూర్గోజు నాగరాజు డిమాండ్ చేశారు. శనివారం ఆలయ భూములు కాపాడాలని కొమురవెల్లి తహసిల్దార్ లక్ష్మీనారాయణకు, ఆలయ ఏఈవో బుద్ధి శ్రీనివాస్‌కు పార్టీ నాయకులతో కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ దేవాలయ భూముల్లో అక్రమంగా కొందరు వ్యాపార సముదాయాలు ఏర్పాటు చేశారని అధికార పార్టీ అండతో వారి వద్ద అద్దెలు వసూలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. అధికారులను ప్రలోభాలకు గురిచేస్తూ మల్లన్న ఆలయ భూములను కబ్జా చేస్తున్నారని ఆరోపించారు. ఆలయ అధికారులు మల్లన్న భూములను కాపాడకపోతే త్వరలో బీజేపీ ఆధ్వర్యంలో ఈవో కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా ఓబీసీ గీత సెల్ కన్వీనర్ ఘనబోయిన శ్రీనివాస్ గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి పుట్ట కనకయ్య, మండల ఉపాధ్యక్షులు జనగామ తిరుపతి గౌడ్, యువ మోర్చా మండల అధ్యక్షులు సానాది కర్ణాకర్, దళిత మోర్చా మండల అధ్యక్షులు బచ్చలి రాజు, కిసాన్ మోర్చా మండల అధ్యక్షులు తడకపల్లి కనకయ్య, యువ మోర్చా మండల ప్రధాన కార్యదర్శి నరేందర్ పాల్గొన్నారు

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

- మరో ముగ్గురికి తీవ్ర గాయాలు



నవతెలంగాణ-గజ్వేల్‌రూరల్

కారు ఢీకొని ఓ మహిళ మృతి చెందగా, మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి ఈ సంఘటన గజ్వేల్ మండలం రిమ్మనగూడ సమీపంలో శనివారం చోటుచేసుకుంది. గజ్వేల్ సీఐ సైదా తెలిపిన వివరాల ప్రకారం సికింద్రాబాద్ పట్టణానికి చెందిన మహమ్మద్ రాజా, అతని భార్య జమీల(70), కుమారుడు ఖుజీమ్, కోడలు సకీణాలరాజాలు, బాలెనో కారులో జనగామ వెళ్లారు. తిరుగు ప్రయాణం సికింద్రాబాద్‌కి బయలుదేరారు. మార్గమధ్యంలో రిమ్మనగూడ వద్ద ఉన్న ఎస్4 హెూటల్ వద్ద భోజనం చేసేందుకు ఆగారు. భోజన అనంతరం సికింద్రాబాద్ వెళ్లేందుకు కారులో రోడ్డు దాటుతుండగా సిద్దిపేట నుంచి ప్రజ్ఞాపూర్ వైపు వస్తున్న డీసీసీబీ చైర్మెన్ చిట్టి దేవేందర్ రెడ్డి ప్రయాణిస్తున్న ఫార్చునర్ కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న నలుగురికి తీవ్ర గాయాలు కావడంతో గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆస్పత్రి చేరుకునే సమయానికి జమీల మృతి చెందగా, మిగతా ముగ్గురిని మెరుగైన చికిత్స కోసం సికింద్రాబాద్ లోని కిమ్స్ ఆస్పత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సైదా తెలిపారు.

బీసీ కుల గణన సర్వేను విజయవంతం చేయాలి



నవతెలంగాణ-సిద్దిపేట

కాంగ్రెస్ ప్రభుత్వం తలపెట్టిన బీసీ కుల గణన సర్వేను విజయవంతం చేయాలని గ్రంథాలయ సంస్థ చైర్మెన్ లింగమూర్తి, డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి, నియోజకవర్గం ఇన్చార్జిలు పూజల హరికృష్ణ, చేరుకు శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సిద్ధిపేటలోని డీసీసీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ సిద్ధిపేట జిల్లాలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న బీసీ కులగణన సర్వేలో కాంగ్రెస్ నాయకులు పాల్గొని ప్రజలకు అవగాహన కల్పిస్తూ, వార్డు అధికారులతో కలిసి సర్వేలో పాల్గొనాలని అన్నారు. బీసీ కుల గణన సర్వే ద్వారా బీసీలు అందరికీ న్యాయం జరుగుతుందని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించే కులగణన సర్వే ద్వారా స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో రిజర్వేషన్లు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. బీసీ కులాలపై వారి కులవృత్తులు ప్రస్తుత ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా ఎదుర్కొంటున్న ఇబ్బందులు తదితర అనేక అంశాలపై సర్వే ద్వారా తెలుస్తుందని అన్నారు. గతంలో బీసీ కులగనకు ఎన్నో కమిషన్ వేసిన ఫలితం శూన్యమని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలో సీఎం రేవంత్ రెడ్డి ఆలోచించి సాహెూస పేతమైన నిర్ణయం తీసుకున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

అవినీతి రహిత సమాజాన్ని నిర్మిద్దాం

- డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ గణపతి రావు



నవతెలంగాణ-గజ్వేల్

నెహ్రూ యువకేంద్ర,సేవా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో విజిలెన్స్ అవగాహణ వారోత్సవల్లో భాగంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ గణపతి రావు సేవా స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు దేశబోయిని నర్సింహులుతో కలిసి ప్రతిజ్ఞ చేశారు. శనివారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ అవినీతి రహిత సమాజాన్ని నిర్మిద్దాం అని అవినీతి మన దేశ ఆర్థిక, రాజకీయ, సామాజిక ప్రగతికి ప్రధాన అడ్డంకిగా మారిందని అందరు తెలుసుకోవాలని ప్రభుత్వం, పౌరులు ప్రయివేటు రంగం వంటి అన్ని భాగస్వాములు కలిసి అవినీతిని నిర్మూలించేందుకు పని చేయాల్సిన అవసరం ఉందన్నారు.ప్రతి పౌరుడు జాగ్రత్తగా ఉండి ఎల్లప్పుడూ అత్యున్నత స్థాయి నిజాయితీ సమగ్రతకు కట్టుబడి ఉండి, అవినీతి వ్యతిరేక పోరాటానికి మద్దతు ఇవ్వాలన్నారు. తీవ్రవాదం కన్న అవినీతి ప్రమాదంగా మారిందని నిస్వార్థసేవకు ప్రాధాన్యతనిచ్చి ముందుకు సాగి దేశాన్ని ప్రగతి పథంలో నిలుపుదాం అందరూ కలిసి ప్రతిజ్ఞ చేసారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ కళాశాల అధ్యాపక బృందం విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

చెకుముకి టాలెంట్ టెస్ట్ వాల్ పోస్టర్ల ఆవిష్కరణ



నవతెలంగాణ-దుబ్బాక

ఈనెల 7 న ప్రారంభంకానున్న 'జన విజ్ఞాన వేదిక చెకుముకి టాలెంట్ టెస్ట్' వాల్ పోస్టర్లను దుబ్బాక లోని ఎమ్మార్సీ కార్యాలయం ఎదుట శనివారం జన విజ్ఞాన వేదిక జిల్లా కమిటీ సభ్యులు ఎండీ సాదత్ అలీతో కలిసి ఎంఈఓ జే.ప్రభుదాస్ ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ, మండలంలోని 8,9,10 తరగతులు చదువుతున్న విద్యార్థుల్ని ఈ టాలెంట్ టెస్ట్ లో పాల్గొనేలా ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు కృషిచేయాలన్నారు. ఈ నెల 21 న మండల స్థాయిలో ,ఈనెల 28 న జిల్లాస్థాయిలో, డిసెంబర్ 14, 15 ,16 తేదీల్లో రాష్ట్రస్థాయిలో ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. అంతకు ముందు మున్సిపల్ పరిధిలోని లచ్చపేటలో మోడల్ స్కూల్లో చెకుముకి టాలెంట్ టెస్ట్ దుబ్బాక మండల కన్వీనర్, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎస్.బుచ్చిబాబు ఈ పోటీలకు సంబంధించిన వాల్ పోస్టర్లను ఉపాధ్యాయ బృందంతో కలిసి ఆవిష్కరించారు. వారి వెంట ఉపాధ్యాయులు నరసింహారెడ్డి, సామయ్య, గణేష్, శ్రీధర్, నవీన్, నాగరాజు పలువురున్నారు.

వడ్ల కొనుగోలు వెంటనే ప్రారంభించాలి



నవతెలంగాణ-దుబ్బాక రూరల్

కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉన్న ధాన్యాన్ని వెంటనే రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేయాలని బీఆర్ఎస్ నాయకులు చింతల కృష్ణ డిమాండ్ చేశారు. శనివారం అక్బర్ పేట-భూంపల్లి మండల కేంద్రంలోని పోతారెడ్డి పేటలో ఇటీవల కురిసిన వర్షానికి తడిసి ముద్దైన ధ్యాన్యాన్ని రైతులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా రైతు సంక్షేమం కోసం పని చేస్తుందని ఆ పార్టీ నాయకులు గొప్పలు చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని, కొనుగోలు సెంటర్లో ధాన్యం అమ్ముకోవాలని రైతులకు చెప్పి18 రోజులు గడుస్తున్న నేటికీ గింజ కొనుగోలు చేయకపోవడంతో నిత్యం రైతులు సెంటర్లోనే పడిగాపులు కాస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతుల నుంచి ఇప్పటివరకు కిలో వడ్ల తూకం వేసిన సందర్భాలు లేవని మండిపడ్డారు. సీఎం రేవంత్ రెడ్డి హైడ్రా పై పెట్టిన దృష్టి ప్రజాపాలనపై పెట్టాలన్నారు. తొందరగా సెంటర్లో నిల్వ ఉన్న ధాన్యం కొనుగోలు చేయాలని లేని పక్షంలో గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులకు ఎక్కడిక్కడ అడ్డుకుం టామని హెచ్చరించారు. ఇటీవల పోతారెడ్డి పేట వడ్ల కొనుగోలు ప్రారంభంలో కాంగ్రెస్ నాయ ఓకులు ప్రోటోకాల్ పాటించలేదని పీఏసిఎస్ చైర్మెన్ షేర్ల కైలాసం ప్రారంభిస్తే స్థానిక కాంగ్రెస్ నాయకులు ఓపెన్ చేశామని చెప్పుకోడం హాస్యాస్పద మన్నారు. ఇకనైనా కాంగ్రెస్ నాయకు లు ప్రోటోకాల్ పాటించాలని సూచించారు.

కాంగ్రెస్ ప్రభుత్వంతోనే గ్రామాల అభివృద్ధి



నవతెలంగాణ-మిరుదొడ్డి

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేద బడుగు బలహీన వర్గాలకు ఎంతగానో అభివృద్ధి చెందుతుందని కాంగ్రెస్ సీనియర్ నాయకులు మాజీ సర్పంచ్ కిష్టయ్య, జోగ్గారి భాస్కర్‌లు అన్నారు. శనివారం కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు తూముకుంట నర్సారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దుబ్బాక నియోజకవర్గం లో అభివృద్ధి పట్ల చర్చించారు. గ్రామాల్లోని ప్రజలకు సమస్యలు పరిష్కరించాలని కోరారు. చెరుకు ముత్యం రెడ్డి సమయంలో దుబ్బాక ఎంతగానో అభివృద్ధి చెందని తెలిపారు. అదే మాదిరిగా నేడు గ్రామాల అభివృద్ధికి సహకరించాలని అన్నారు.

సంక్షేమ పథకాలు అమలు చేయండి



నవతెలంగాణ-గజ్వేల్

సంక్షేమ పథకాలు కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని బీఆర్ఎస్ గజ్వేల్ నాయకులు కళ్యాణ్కర్ శ్రీనివాస్ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయడం లేదన్నారు. ఆరు గ్యారెంటీలకు ప్రజలు నోచుకోవడం లేదన్నారు. గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలో పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పంపిణీ కార్యక్రమాన్ని కాంగ్రెస్ వాయిదా వేస్తూ వస్తుం దన్నారు. పేదలకు వెంటనే డ్రాప్ పద్ధతిలో వచ్చిన వారికి ఇల్లు కేటాయించాలని కోరారు.

డీఎంహెచ్ఓను కలిసిన హెచ్‌వన్ యూనియన్ నేతలు



నవతెలంగాణ-సిద్దిపేట

నూతన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పల్వాన్ కుమార్‌ని శనివారం తెలంగాణ మెడికల్ అండ్ పబ్లిక్ హెల్త్ ఎంప్లాయిస్(హెచ్‌వన్) యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జాకీర్ హుస్సేన్, మహేందర్ గౌడ్ ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓని శాలువాతో సత్కరించి, బొకే ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ఓలు రవీందర్ రెడ్డి, లింగమూర్తి, యూనియన్ నాయకులు, హెల్త్ అసిస్టెంట్‌లు లింగం గౌడ్, రాజ్ కుమార్, మల్లేశంలు పాల్గొన్నారు.